



# విజయభాను







విశాఖపట్నం, గురువారం 25-07-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 274 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ఏపీ గవర్నర్‌గా బిశ్వభూషణ్ ప్రమాణస్వీకారం

### హాజరైన సీఎం జగన్, చంద్రబాబు, రాజకీయ ప్రముఖులు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ నూతన గవర్నర్‌గా బిశ్వభూషణ్ హరిచందన్ ప్రమాణస్వీకారం చేశారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సి.ప్రవీణ్‌కుమార్ ఆయన చేత రాజ్‌భవన్ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితో పాటు మంత్రులు, ప్రతిపక్షనేత చంద్రబాబు, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, పలువురు ముఖ్య అధికారులు, ఎమ్మెల్యేలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తెలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా నరసింహన్ వ్యవహరించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఒడిశాకు చెందిన బిశ్వభూషణ్ హరిచందన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. బిశ్వభూషణ్ హరిచందన్ 1934 ఆగస్టు 3న రాజ కుటుంబంలో జన్మించారు. ఆర్థిక శాస్త్రంలో పీజీ డిగ్రీ పూర్తి చేశారు. 1971లో భారతీయ జనసంఘ్‌లో చేరారు. ఆయనకు భారతీయ జనతా పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. 1980లో భాజపా ఒడిశా అధ్యక్షుడిగా, భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బిశ్వభూషణ్ సేవలందించారు. ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో మీసా



నూతన గవర్నర్ బిశ్వభూషణ్‌కు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం.



చట్టం కింద అరెస్టయ్యారు. ఇందిరాగాంధీ పాలనపై ఒడిశా హైకోర్టు లాయర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. 1977లో ఇందిరకు వ్యతిరేకంగా ఒడిశాలో ప్రచారం నిర్వహించారు. 1990లో బిజూ పట్నాయక్ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించారు. 1996లో ఒడిశా బీజేఎల్పీ నేతగా బాధ్యతలు చేపట్టారు. భాజపా, బీజేడీ ఉమ్మడి తరువాయి 2లో..

### అనవసర చర్చలతో సభా సమయాన్ని

# వృధాచేయొద్దు

- అబద్ధం వందసార్లు చెప్పినా అది నిజమైపోదు
- ప్రతిరోజూ రాద్ధాంతమేనా!
- ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి



అమరావతి: ఒకే అబద్ధాన్ని వందసార్లు చెబితే అది నిజమైపోదని ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావిస్తున్నామని చెబుతూనే ఉన్నామని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రతిపక్ష తెదేపా నాయకులు తమపై విమర్శలు చేయడం సరికాదని మండిపడ్డారు. అనవసర చర్చలతో సభాసమయాన్ని వృథా చేయవద్దని సూచించారు. బుధవారం సభ ప్రారంభమైన తర్వాత ప్రశ్నోత్తరాల సమయం తరువాయి 2లో..



బెంగళూరు: కర్ణాటక శాసనసభలో నిర్వహించిన విశ్వాస పరీక్షలో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం ఓటమి పాలైన నేపథ్యంలో సీఎం పదవికి కుమారస్వామి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేశారు. రాజ్‌భవన్‌కు చేరుకుని

## ప్రభుత్వ ఏర్పాటుకు బిజెపి ప్రణాళిక

- ఓటమి పాలైన సంకీర్ణం
- కుమార సర్కార్‌కు కనీస మద్దతు నో
- సీఎం పదవికి కుమారస్వామి రాజీనామా
- గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పణ
- కర్ణాటకలో ఇద్దరు ఉపముఖ్యమంత్రులు!

గవర్నర్ వాజూభాయ్‌వాలాకు రాజీనామాను సమర్పించారు. రాజీనామాను స్వీకరించిన గవర్నర్.. వెంటనే దాన్ని ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని, ఈ సమయంలో ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని గవర్నర్ కుమారస్వామికి సూచించారు.

కుమారస్వామి ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానంపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం సభలో ఓటింగ్ నిర్వహించగా.. తరువాయి 2లో..

## కాల్‌మనీ కేసుల్లో రూ.700 కోట్ల వ్యాపారం

- ఈ వ్యవహారంలో మొత్తం 18 కేసులు నమోదు
- శాసనమండలిలో హోంమంత్రి సుచరిత వెల్లడి



అమరావతి: కాల్‌మనీ కేసుల్లో మొత్తం రూ. 700 కోట్ల వ్యాపారం జరిగిందని ఏపీ హోంమంత్రి మేకతోటి సుచరిత తరువాయి 2లో..

## ఉగ్రవాదులున్నమాట నిజమే

### చిత్తశుద్ధిలోపంతోనే పెచ్చుమీరుతున్న ఉగ్రవాదం

### పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్



వాషింగ్టన్: అమెరికా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ ఎట్టకేలకు నిజాన్ని అంగీకరించారు. తమ దేశంలో ఇంకా 30 వేల నుంచి 40 వేల మంది ఉగ్రవాదులు ఉన్నారని బహిరంగంగా ప్రకటించారు. గత ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం వల్లే వాటి కార్యకలాపాలు హెచ్చుమీరాయన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన యునైటెడ్ స్టేట్స్ పీస్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రసంగిస్తూ ఈ విషయాలు బయటపెట్టారు. ముష్కరులంతా అఫ్ఘనిస్థాన్, కశ్మీర్ ప్రాంతాల్లో శిక్షణ పొంది దాడులకు పాల్పడుతున్నారన్నారు. 2014లో తరువాయి 2లో..

## భాజపాలో సభ్యత్వం దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం

### భాజపాతోనే ఏపీకి న్యాయం.. వైకాపా తప్పటడుగులు వేస్తోంది

### బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్



అంబాజీపేట: రాష్ట్రంలో కొత్తగా వచ్చిన వైకాపా ప్రభుత్వం కూడా తప్పటడుగులు వేస్తోందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్ విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయ పార్టీ భాజపాతోనే ఏపీకి న్యాయం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లలో ఓ ప్రాంతీయ పార్టీ వలన రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని ప్రజలు చూశారని.. అందుకే మరో ప్రాంతీయ పార్టీకి అవకాశమిచ్చారన్నారు. ఈ ప్రభుత్వం వల్ల మేలు జరగకపోగా కీడే ఎక్కువగా జరుగుతోందనే భయం కలుగుతోందని ఆయన ఆరోపించారు. భాజపాలో సభ్యత్వం దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అని రాంమాధవ్ వ్యాఖ్యానించారు. 2024 నాటికి ఏపీలో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించబోతుందని ఆయన జోస్యం చెప్పారు. గ్రామగ్రామాన భాజపాను పటిష్ఠం చేయాలని.. సభ్యత్వ నమోదును దీనికి సాధనంగా ఉపయోగించుకోవాలని కార్యకర్తలకు సూచించారు.






## ఏపీ పీఏసీ చైర్మన్‌గా పయ్యావుల కేశవ్



అమరావతి: ఏపీ ప్రజాపద్దుల కమిటీ (పీఏసీ) ఛైర్మన్‌గా ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను తెదేపా అధినేత చంద్రబాబు ఎంపిక చేశారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన వారిని పీఏసీ ఛైర్మన్‌గా ఎంపిక చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో పయ్యావులను ఎంపిక చేస్తూ చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. పీఏసీ ఛైర్మన్ పదవికి మాజీ మంత్రులు తరువాయి 2లో..

## అక్టోబర్ నుంచే రైతుభరోసా



అమరావతి: రాష్ట్రంలోని రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో ఉన్నామని ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. తరువాయి 2లో..




# సిఎం జగన్ చిత్రం పటానికి పాలాభిషేకం

## బిసి, ఎస్ సి , ఎస్ టి, మైనారిటీ లకు 50 శాతం నిర్ణయం చరిత్రాత్మకం అన్న కె కె రాజు




విశాఖ సిటీ : నామినేటెడ్ పదవులు , కాంట్రాక్టు వర్క్స్ లో బిసి, ఎస్ సి , ఎస్ టి, మైనారిటీ లకు 50 శాతం కేటాయిస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రెడ్డి తీసుకున్న సందర్భంగా బుధవారం విశాఖ పార్లమెంట్ ఎస్ సి సెల్ అధ్యక్షుడు రేయి వెంకటరమణ ఆధ్వర్యంలో సీతమ్మదార లో గల విశాఖ ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఉత్తర నియోజకవర్గ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త కె కె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె కె రాజు మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన మన జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా బాధ్యతలు తీసుకున్న 50 రోజుల్లో హామీలు నెరవేర్చే దిశగా పథకాలు రూపకల్పన చేశారని కొనియాడారు.

నామినేటెడ్ పదవులు , కాంట్రాక్టు వర్క్స్ లో బిసి, ఎస్ సి , ఎస్ టి, మైనారిటీ లకు 50 శాతం కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకశీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, పార్లమెంట్,సిటీ, నాయకులు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు

# స్పందన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

## పాడేరు డిఎస్పి వి బి రాజ్ కమల్



అనంతగిరి ,మండల కేంద్రంలో గల పోలీస్ స్టేషన్లో పాడేరు డి.ఎస్.పి వి బి రాజ్ కమల్ ఆకస్మిక తనిఖీ చేశారు స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, కొన్ని సూచనలు చేశారు ,కమ్యూనిటీ పోలీసింగ్ ప్రజలకు దగ్గరగా ఉండాలని శాంతిభద్రతలు కు విఘాతం కలగకుండా చూడాలని ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సి ఐ జి ,కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారాలి

## జిల్లా కలెక్టర్ జె నివాస్



శ్రీకాకుళం: జిల్లా పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారాలని , ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో మొక్కల పెంపకం పై అటవీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ, సంబంధిత శాఖలతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కలను నాటాలని అన్నారు. పచ్చదనంతో జిల్లా ఆహ్లాదకరంగా మారాలని ఆయన ఆకాంక్షించారు. జిల్లా పర్యావరణ పరిరక్షణకు నిలువుటద్దంగా ఉండాలని, ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న భూములలో బ్లాక్ ల వారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని చెప్పారు. సామాజిక అటవీ విభాగం ఆధ్వర్యంలో 200 హెక్టార్లలో బ్లాక్ ప్లాంటేషన్ జరగాలని, టెరిటోరియల్ విభాగంలో 5 వందల హెక్టార్లలో మొక్కలు పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు విభాగాలు కలిపి 125 హెక్టార్ల చొప్పున అవెన్యూ ప్లాంటేషన్ జరగాలని సూచించారు.

ఈ పనులన్నీ ఆగస్టు 15వ తేదీ నాటికి పూర్తి చేయాల్సిందేనని తేల్చిచెప్పారు . వర్షాలు కురవక ముందే మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, ఇందులో అటవీ శాఖ క్రియాశీలకంగా పనిచేయాలని కలెక్టర్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర ప్రదేశాల్లో పెద్ద ఎత్తున మొక్కలు పెంచాలని తెలిపారు. జిల్లాలో కనీసం 20 సెంట్ల స్థలం ఉన్న పాఠశాలల జాబితా సమర్పించాలని కలెక్టర్ చెప్పారు. అటవీశాఖ 9.10 లక్షలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గట్లపై లక్ష మొక్కలు, ఉద్యానవన శాఖ 5.50 లక్షలు, ఇతర శాఖలు ఆధ్వర్యంలో మిగిలిన మొక్కలు వెరశి 55 లక్షలు మొక్కలు నాటడం లక్ష్యం కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకానికి సంబంధించి ఉపాధి హామీ క్రింద 3 సంవత్సరాలకు నిర్వాహణ వ్యయాన్ని మంజూరుచేయడం జరుగుతుందని పేర్కొన్నారు . జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హెచ్.కూర్మారావు మాట్లాడుతూ జిల్లాలో 4.71 లక్షల కొబ్బరి, 3.63 లక్షల జీడి మామిడి, 2 వందల కిలోమీటర్ల రహదారి మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ కు వివరించారు

. సామాజిక అటవీ విభాగం జిల్లా అటవీశాఖ అధికారి బి. ధనంజయ రావు మాట్లాడుతూ బ్లాక్ ల వారీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు .

ఈ సమావేశంలో డివిజనల్ అటవీ అధికారి జి.లక్ష్మణ్, జిల్లా విద్యాశాఖ అధికారి చంద్ర కళ, ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు పి.లక్ష్మి ప్రసాద్, ఏ.పీ.ఎం.ఐ.పి పథక సంచాలకులు ఏ.వి.ఎస్వీ.జమదగ్ని, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు, అటవీ శాఖ రేంజ్ అధికారి గోపాల్ నాయుడు , జిల్లా పంచాయతీ అధికారి బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన అధికారిగా అమర్నాధ్

రావులపాలెం: కొత్తపేట ఉద్యాన అధికారిగా పి.బి.ఎస్. అమర్నాద్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉద్యాన అధికారిగా పనిచేసిన యం. బబిత అయినవిల్లి ఉద్యాన అధికారిగా బదిలీ కావడంతో ఆ స్థానంలో తాను నియమితులైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భముగా అమర్నాద్ మాట్లాడుతూ మండలంలో ప్రతి రైతుకు పంట దిగుబడులపై అవగాహన కల్పిస్తానని, ఏ సమయంలో ఏ మందులు పిచికారీ చేయాలి, ఏ పంట వేస్తే అధిక దిగబడులు వస్తాయి, సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తానని తెలిపారు. పంటలపై ఎరువులు, పురుగు మందులు ఎక్కువ మోతాదులో వాడకుండా రైతులు సేంద్రీయ ఎరువులు వాడే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

# తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ వినూత్న నిరసన



రావులపాలెం: రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా 108 సిబ్బంది స్థానిక పోలీస్ స్టేషను వద్ద గల దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వినతి పత్రం సమర్పించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భముగా 108 సిబ్బంది మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ స్థానిక ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా నిమిషాల్లో అక్కడకు చేరుకొని, ప్రాణాలు కాపాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలిస్తూ ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నామని, తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చడానికి బివిసి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం మీనవేషాలు లెక్కిస్తూ తమను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసారు. అంతేకాక చాలీ చాలని జీతంతో 108 ఎమర్జెన్సీ అంబులెన్స్ వ్యవస్థలో గత 13 సం॥లుగా మెడికల్ టెక్నీషియన్‌గా, ఎమర్జెన్సీ అంబులెన్స్ డ్రైవరుగా విధులు నిర్వహిస్తున్నామని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, తాను నిర్వహిస్తున్న 12 గంటల సర్వీసును 8 గంటలకు కుదించి తమపై ఒత్తిడి తగ్గించాలని, తమ వేతనాలు నేరుగా ప్రభుత్వమే చెల్లించి ప్రభుత్వ హెచ్ఆర్ పాలసీతో ఉద్యోగ భద్రత కల్పించాలని, తమకు మండల కేంద్రాలలో ఇంటి స్థలం కేటాయించి, ఇంటి నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో యాలంగి చిట్టిబాబు, పలివెల లోవరాజు, అజ్జరపు శాంతారావు, మట్టపర్తి నాని, సూర్య శ్రీనివాస్, బొంతు అంజనేయులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రంధాలయ పితామహుడు అయ్యంకి జయంతి



రావులపాలెం:భారతదేశంలో గ్రంధాలయాల ఏర్పాటుకు అయ్యంకి వెంకట రమణయ్య చేసిన కృషి గణనీయమైనదని పడాల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ, అక్షర దీపిక స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గ్రంధాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముందుగా పాఠశాలలో అల్లూరి సీతారామరాజుపై నిర్వహించిన వివిధ క్రీడా,ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు వై రామసీత అధ్యక్షతన సేవా సంస్థ అధ్యక్షులు పోతంశెట్టి కనికిరెడ్డి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కనికిరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో గ్రంధాలయాల ఏర్పాటుకు అయ్యంకి వెంకటరమణయ్య ఎంతగానో కృషి చేసారని, ఆయన స్ఫూర్తితో ప్రతి మండల కేంద్రంలో అనేక గ్రంధాలయాలు వెలిశాయని, ప్రతి విద్యార్థి గ్రంధాలయాలను వినియోగించుకొని మంచి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే అల్లూరిలోని పట్టుదల, ధైర్యముతదితర గుణాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు ఒక లక్ష్యం పెట్టుకొని విజయం సాధించాలని అన్నారు. దాతల సహకారాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడిన విద్యార్థులు సమాజానికి తోడ్పడాలని తెలిపారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలను ఘనంగా సత్కరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో పడాల రామకృష్ణారెడ్డి, గొలుగూరి ఆదిరెడ్డి, పడాల సోమిరెడ్డి, కర్రి శ్రీనివాసరెడ్డి, రాయుడు సత్తిరాజు, కర్రి మానస, దుళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో బలమైన శక్తిగా బిజెపి

## బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు



అచ్యుతాపురం : ప్రధాని నరేంద్రమోడి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై రాష్ట్రంలో బలమైన శక్తిగా భారతీయ జనతా పార్టీ ఎదుగుతుందని యలమంచిలి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు అన్నారు .బుధవారం మండలంలో చీమలాపల్లి గ్రామానికి చెందిన 50 మంది బిజేపిలో చేరారు . వారికి బిజెపి కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు .ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడానికి కృషి చేద్దామన్నారు .ప్రజలు బిజెపి వైపు ఆకర్షితులవుతున్నారని గ్రామాల నుండి పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయన్నారు .ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గొంతిన భక్తసాయిరాం ,మేరుగు కాసుబాబు , రాజాన రాజు తో పాటు శ్రీనివాస్ , సత్యారావు ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు .

మొదటి పేజీ తరువాయి

# ఏపీ గవర్నర్‌గా బిశ్వభూషణ్ ప్రమాణస్వీకారం

ప్రభుత్వంలోనూ మంత్రిగా కొనసాగారు.

### *గవర్నర్ బిశ్వభూషణ్‌కు పవన్ శుభాకాంక్షలు*

ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ప్రమాణస్వీకారం చేసిన బిశ్వ భూషణ్ హరిచందన్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు చెప్పారు. అపార రాజకీయ అనుభవం ఉన్న హరిచందన్.. కొత్త రూపు సంతరించుకుంటున్న ఏపీకి గవర్నర్‌గా రావడం శుభపరిణామమన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అభివృద్ధిలేమి, నిధుల కొరత, అసంపూర్తిగా మిగిలిపోయిన విభజన హామీలతో సతమతమవుతున్న రాష్ట్రానికి ఆయన అండగా ఉంటారని ప్రజలు ఆశతో ఉన్నారన్నారు. జ్ఞాన సంపన్నుడు, అపార రాజకీయ అనుభవం కల్గిన బిశ్వభూషణ్ హరిచందన్ గవర్నర్ పదవికి మరింత వన్నె తీసుకొస్తారని ఆశిస్తున్నట్టు పవన్ పేర్కొన్నారు.

# అనవసర చర్చలతో సభా సమయాన్ని వృధాచేయొద్దు

తెదేపా ఎమ్మెల్యే సత్యప్రసాద్ లేవనెత్తిన ప్రశ్నకు సంబంధిత మంత్రి సమాధానం చెప్పారని, కానీ స్పీకర్ పెద్దమనసుతో మళ్లీ సత్యప్రసాద్‌కు అవకాశం ఇచ్చారని అన్నారు. మంత్రి సమాధానం చెప్పిన తర్వాత మళ్లీ అవకాశం అడగడమేంటని ప్రశ్నించారు. సభ ప్రారంభమై దాదాపు గంటసేపైనా ఇప్పటి వరకు కేవలం 3 ప్రశ్నలకే సమాధానం చెప్పగలిగామని, మిగతా వాటికి కూడా బదులిచ్చేందుకు సభ్యులు సహకరించాలని కోరారు.

### 29 మంది మరణానికి కారణమెవరు?

### వైకాపా ఎమ్మెల్యే జోగి రమేశ్

అంతకుముందు వైకాపా ఎమ్మెల్యే జోగి రమేశ్ మాట్లాడుతూ.. గోదావరి పుష్కారాల్లో 29 మంది మరణానికి కారణమెవరని ప్రశ్నించారు. మరణానికి కారణమైన వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని మండిపడ్డారు. పుష్కరాల సమయంలో అక్కడ సినిమా షూటింగ్ జరపడం వల్లే ఒక్కసారిగా తొక్కిసలాట జరిగిందని ఆయన అన్నారు. మరణానికి కారణమైన వారికి శిక్ష తప్పదని పేర్కొన్నారు. పుష్కరాల్లో వేల కోట్ల దోపిడీ జరిగిందన్న జోగి రమేష్.. అది కుంభమేళా కాదని.. కుంభకోణమని అభిప్రాయపడ్డారు. వేల కోట్ల ప్రజాధనాన్ని మంచినీళ్లలా ఖర్చుపెట్టారని విమర్శించారు. మరోవైపు కృష్ణ పుష్కరాల్లోనూ అవకతవకలు చోటు చేసుకున్నాయని, వందల ఇళ్లను నేలమట్టం చేశారని ఆరోపించారు.

### సస్పెన్షన్ ఎత్తివేయాలి

తెదేపా శాసనసభపక్ష ఉపనేతలు అచ్చెన్నాయుడు, రామానాయుడు, బుచ్చయ్యచౌదరిపై సస్పెన్షన్ ఎత్తివేయాలంటూ సభప్రారంభానికి ముందు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. సభాహక్కులు కాపాడాలంటూ ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు.

# ప్రభుత్వ ఏర్పాటుకు బిజెపి ప్రణాళిక

కనీస మెజార్టీకి అవసరమైన సభ్యుల మద్దతును కుమార సర్కార్ సంపాదించలేకపోయింది. ఈ పరిస్థితుల్లో దాదాపు 14 నెలల కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం పతనమైంది. 99- 105 ఓట్ల తేడాతో ప్రభుత్వం పడిపోయింది.

### కర్ణాటకలో ఇద్దరు ఉపముఖ్యమంత్రులు!

### అధిష్ఠానంతో చర్చించిన తర్వాతే నిర్ణయం

కాంగ్రెస్-జేడీఎస్ సర్కారు కూలిపోవడంతో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో 14 నెలల ఆపరేషన్ యజ్ఞానికి తగిన ఫలితం పొందిన బి.ఎస్.యడ్యూరప్పకు ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొనే అవకాశం అందివచ్చింది. ప్రభుత్వ ఏర్పాటుకుగానూ భాజపా శాసన సభాపక్ష సమావేశం జరిగింది. రాబోయే భాజపా ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా యడ్యూరప్పతోపాటు.. మరో ఇద్దరిని ఉప ముఖ్యమంత్రులుగా నియమించే అంశాలపై చర్చించారు. ఈ ప్రతిపాదన ప్రతిని గవర్నర్ వజుభాయ్ వాలాకు యడ్యూరప్ప అందించారు. అనంతరం కొత్త ప్రభుత్వ ఏర్పాటు కోసం పార్టీ అధిష్ఠానంతో చర్చించేందుకు యడ్డీ దిల్లీ బయల్దేరి వెళ్లారు. అధిష్ఠానం ఆదేశిస్తే నేడే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. భాజపాకు స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో సర్కారు ఏర్పాటుకు జాప్యం చేయకూడదని ఆ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం.

బల పరీక్ష వరకు భాజపా నేతలందరూ ఏకతాటి మీద ఉన్నప్పటికీ అంతర్గతంగా కుమ్ములాటలున్నాయి. ఈ నేపథ్యంలో ఎంత వీలైతే అంత త్వరగా అధికార కుర్చీలో కూర్చోవాలని కమలనాథులు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వాన్నయితే గద్దె దించారు గానీ.. ఇప్పుడు స్పష్టమైన మెజార్టీ లేకపోవడంతో భాజపా నేతలకు భయం పట్టుకుంది. బల పరీక్షకు ముందు ఆపరేషన్ రివర్స్‌కు సిద్ధమైనట్లు కుమారస్వామి ప్రకటించిన విషయం తెలిసిందే. అసలే ప్రభుత్వాన్ని కోల్పోయిన బాధలో ఉన్న కుమార ఆపరేషన్ రివర్స్‌ను అమలు చేసినా ఆశ్చర్యపోనవరం లేదు. ఈనేపథ్యంలో వీలైనంత తొందరలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భాజపా నేతలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అది గవర్నర్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.

# కాల్‌మనీ కేసుల్లో రూ.700 కోట్ల వ్యాపారం

తెలిపారు. శాసన మండలిలో కాల్ మనీ కేసులకు సంబంధించిన అడిగిన ప్రశ్నకు ఆమె మంగళవారం సమాధాన మిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18 కాల్ మనీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. విజయవాడలో 14, పశ్చిమ గోదావరిలో మూడు, కడపలో ఒక కేసు నమోదైనట్టు వివరించారు. విజయవాడలో ఈ కేసులకు సంబంధించి మొత్తం 30 మందిని అరెస్టు చేశామన్నారు. వీరిలో ఏడుగురిపై రౌడీషీటు ఓపెన్ చేసినట్టు తెలిపారు. కాల్ మనీ వ్యవహారానికి వ్యతిరేకంగా గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించిన విషయాన్ని హోంమంత్రి గుర్తు చేశారు. గత చంద్రబాబు ప్రభుత్వం కాల్ మనీ కేసుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలిపారు.

# ఉగ్రవాదులున్నమాట నిజమే

తాలిబన్లు చేసిన దాడిలో దాదాపు 150 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయినప్పుడే.. దేశంలో ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలను ఏమాత్రం అనుమతించొద్దని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు అన్ని పార్టీలు కలిసి కార్యాచరణ రూపొందించాయన్నారు. కానీ చిత్తశుద్ధి లోపించిన గత ప్రభుత్వాలు దాన్ని అమలు చేయలేకపోయాయని తెలిపారు. తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉగ్రసంస్థల నిర్వీర్యం కోసం చర్యలు తీసుకుంటోందని చెప్పుకొచ్చారు.

అంతకు ముందు జరిగిన మరో కార్యక్రమంలో దేశంలో దాదాపు 40 ఉగ్రవాద సంస్థలు ఉండేవని ఇమ్రాన్ వెల్లడించారు. వాటి విషయంలో పాక్ ప్రభుత్వం ఎప్పుడూ వాస్తవాలను బహిర్గతం చేయలేదని.. అమెరికాకు అబద్ధాలు చెబుతూ వచ్చిందని అంగీకరించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మేం అమెరికాతో కలిసి యుద్ధం చేశాం. కానీ, పాక్ ప్రభుత్వం అమెరికాకి వాస్తవాలు చెప్పలేదు. ఎందుకంటే పాక్ గత ప్రభుత్వాలు తమ నియంత్రణలో ఉండేవి కావు. అప్పట్లో దాదాపు 40 ఉగ్రవాద సంస్థలు పాక్ కేంద్రంగా పనిచేస్తున్నాయి. అసలు దేశం ఎలా మనుగడ సాగిస్తుందనే చర్చ జరిగింది. ఉగ్రవాదంపై పోరాడాలని అమెరికా కోరింది. కానీ, మేం మాత్రం మా ఉనికి కోసం పోరాడాం అని అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు షీలా జాక్సన్ ఏర్పాటు చేసిన సభలో ఇమ్రాన్ తెలిపారు.

గత కొన్నేళ్లుగా అమెరికా-పాక్ మధ్య సంబంధాలు ఆశించిన స్థాయిలో లేవని.. ఇకపై వాటి పునరుద్ధరణకు కృషి చేస్తామని ఇమ్రాన్ చెప్పుకొచ్చారు. తాలిబన్లతో చర్చల విషయంలో అమెరికాకు సహకరిస్తామని తెలిపారు.

# ఏపీ పీఏసీ ఛైర్మన్‌గా పయ్యావుల కేశవ్

గంటా శ్రీనివాసరావు, నిమ్మకాయల చిన్నరాజప్ప, సీనియర్ నేత కరణం బలరాం, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, అనగాని సత్యప్రసాద్, గణబాబు రేసులో ఉన్నప్పటికీ.. పయ్యావుల కేశవ్‌నే చంద్రబాబు ఖరారు చేశారు. బుధవారం నేతలందరితో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. తెదేపా అధికారంలో ఉండగా ప్రస్తుత ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పీఏసీ ఛైర్మన్‌గా వ్యవహరించిన విషయం తెలిసిందే.

# అక్టోబర్ నుంచే రైతుభరోసా

ఆయన బుధవారం అసెంబ్లీలో మాట్లాడుతూ.. వైఎస్సార్ రైతు భరోసా పథకం గురించి స్పష్టత ఇచ్చారు. ఈ పథకం కింద ఏడాదికి రైతులకు రూ. 12,500 ఇస్తామని చెప్పారు. 64లక్షల మంది రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందుతారని, ఇందులో 16లక్షల మంది కౌలు రైతులు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ పథకంలో భాగంగా ఈ ఏడాది రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.8,750 కోట్లు బడ్జెట్‌లో కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

గత టీడీపీ ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి.. రూ. 87వేల కోట్ల రైతు రుణాలు ఉంటే.. రకరకాల సాకులు చూపించి.. రూ. 24వేల కోట్లకు మాత్రమే కుదించారని బుగ్గన తెలిపారు. రుణమాఫీ కోసం రూ. 16,512 కోట్లు కేటాయించి.. అందులో కేవలం రూ. 10,279 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. టీడీపీ ప్రభుత్వం కేటాయించిన నిధులను కూడా ఖర్చు చేయలేకపోయిందన్నారు. నీరు-చెట్టు పథకం పేరుతో టీడీపీ నేతలు దోచుకున్నారని, కేటాయింపులకు మించి ఆరు రెట్లు అదనంగా ఖర్చు పెట్టి.. టీడీపీ నేతలు తమ జేబులు నింపుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు సర్కార్ ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో రుణమాఫీకి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని బుగ్గన వెల్లడించారు.

## 28న తుత్తిరిబెండ పత్రితో అమ్మవారికి అధివాస మహోత్సవము



సబ్బవరం: యాతపాలెం గ్రామము, ఆరిపాక పంచాయితీ, సబ్బవరం మండలంలో గల భువనేశ్వరి దేవి ఆరాధన పీఠంలో ఈ నెల 28వ తేదీన అమ్మవారికి తుత్తిరిబెండ పత్రితో ఆధివాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఓంకార ఋషి తెలిపారు. తుత్తిరిబెండ పత్రితో పలు రకాల వ్యాధులు నయమవుతాయని తెలిపారు. నరాల బలహీనత, దీని కషాయం తాగితే బలహీనత తగ్గుతాదన్నారు. తుత్తిరిబెండ పత్రితో దేహ బాధలను తొలగించి శుద్ధి చేస్తుందన్నారు. పూజకు హాజరయ్యేవారు పాలు, చీర, జాకెట్టు, పూజాసామగ్రితో పూజలు నిర్వహించుకోవాలని ఓంకార్ ఋషి కోరారు.

## జాషువా సాహిత్యం కవులకు ఆదర్శం

### వి.ఎం.ఆర్.డి.ఎ. ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస రావు



విశాఖపట్నం: జాషువా రచనలు నేటితరం కవులకు ఆదర్శప్రాయమని వి.ఎం.ఆర్.డి.ఎ. ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాసరావు అన్నారు. మహాకవి గుఱ్ఱం జాషువా 48వ వర్ధంతి సందర్భంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ బుధవారం ఉదయం బీచ్ రోడ్డులో నిర్వహించిన జాషువా వర్ధంతి సభలో వి.ఎం.ఆర్.డి.ఎ. ఛైర్మన్ ద్రోణంరాజు శ్రీనవాసరావు హాజరై మాట్లాడారు. జాషువా రచనల ద్వారా సామాజిక స్పృహ రగిల్చారన్నారు. గబ్బిలం, ఫిరదౌసి, ముంతాజ్ మహల్, ఖండకావ్యం వంటి ఆయన రచనా సాహిత్యం సమాజాన్ని చైతన్యవంతం చేసిందన్నారు. వైకాపా తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ సమాజంలో అసమానతల నిర్మూలనకు నిరంతరం కృషి చేసిన వ్యక్తి మహా కవి జాషువా అన్నారు. వికసం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు మాట్లాడుతూ సమాజంలో వేళ్లూనికుపోయిన మూఢత్వాన్ని జాషువా తన రచనల ద్వారా ప్రశ్నించారన్నారు. ఎ.యు. ప్రొఫెసర్ జి.యోహానుబాబు, మాట్లాడుతూ సమాజ రుగ్మతలపై కలం ఎక్కుపెట్టిన జాషువా కవిత్వానికి కొత్త చూపునిచ్చారన్నారు. వైకాపా ప్రచార కార్యదర్శి షేక్ అజామ్‌ఆలీ మాట్లాడుతూ సమాజంలో సాంఘిక, అసమానతలు కులతత్వంపై తన కవిత్వంలో అడుగడుగున పోరాడిన గొప్ప కవి జాషువా అని చెప్పారు. వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు సారధ్యం వహించిన ఈ కార్యక్రమంలో రైల్వే ట్రేడ్ యూనియన్ నాయకులు వి.జె.అజయ్ కుమార్, ఎస్.పి.బాలు సంగీత సేవా ట్రస్ట్ అధ్యక్షురాలు ఎం.రమణి, ఎల్.ఐ.సి. డెవలప్‌మెంట్ ఆఫీసర్ బొమ్మిడి సత్యనారాయణ, సంఘం ప్రతినిధులు మల్లిపూడి నాగేశ్వరరావు, ఇందిర సాహిని, చింతా ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా జాషువా విగ్రహానికి ద్రోణంరాజు శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## వినూత్న పరిశోధనలకు గీతం పిహెచ్‌డి అవార్డు

సాగర్‌నగర్: విజ్ఞాన శాస్త్రాలలో జరిపిన వినూత్న అద్యయనాలకు గాను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇద్దరు పరిశోధక విద్యార్థులకు పి.హెచ్.డి అవార్డు ను ప్రకటించింది.

### హైడ్రోజన్ ఇందన నిల్వపై పరిశోధన



వాహనాల చోదక శక్తికి పెట్రోల్‌కు ప్రత్యామ్నయంగా భవిష్యత్‌లో ఉపయోగించనున్న హైడ్రోజన్ ఇంధనాన్ని నిల్వ చేయడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన పరిశోధక విద్యార్థిని కె.మాధవి జరిపిన అద్యయనానికి గాను పిహెచ్‌డి అవార్డును ప్రకటినట్లు రిజిస్ట్రార్ కె.వి.జి.డి బాలాజీ తెలిపారు. ప్రొఫెసర్ ఎమ్. శరత్‌చంద్రబాబు పర్యవేక్షణలో డాక్టర్ కె.మాధవి కార్బన్ నానో ట్యూబ్‌తో హైడ్రోజన్ ఇందనాన్ని నిల్వచేయవచ్చు నని నిరూపించారు. వాహన తయారీ పరిశ్రమలో తాను జరిపిన అద్యయనాల ఆధారంగా ప్రయోజనం పొందవచ్చునని పేర్కొన్నారు.

### ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పై పరిశోధన :



ఉప్పు నీటిని తట్టుకుని నిలిచే మొక్కలపై గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన పరిశోధక విద్యార్థిని కె.దివ్య జరిపిన అద్యయనానికి గాను పిహెచ్‌డి అవార్డును ప్రకటినట్లు రిజిస్ట్రార్ కె.వి.జి.డి బాలాజీ తెలిపారు. రొమ్ము కేన్సర్‌కు ఉపయోగపడే 5 రకాల ఔషధ మొక్కలు వాటి ప్రయోజనంపై తన అద్యయనాలు జరిపినట్లు డాక్టర్ కె.దివ్య తెలిపారు.

కేన్సర్ తో పాటు ఇతర అంటు వ్యాధుల చికిత్సకు తాను గుర్తించిన ఔషధ మొక్కలు ఉపయోగపడాతాయని కె.దివ్య వెల్లడించారు

## ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను ఒడిస్సాకు తరలించొద్దు

### సిపిఐ(ఎం) నగర కార్యదర్శి గంగారావు డిమాండ్



విశాఖపట్నం: విజయవాడ నుండి విశాఖకు రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైల్‌ను భువనేశ్వర్ కు తరలించాలని కేంద్ర ప్రభుత్వం, రైల్వే అధికారులు ప్రయత్నాలను వేంటనే ఉపసంహరించు కోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్ విశాఖ నగర కమిటీ కార్యదర్శి గంగారావు డిమాండ్ చేస్తున్నారు.

నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక, పారిశ్రమిక రాజధానిగా ఉన్న విశాఖ నుండి రాష్ట్ర రాజధాని విజయవాడకు మధ్య ప్రయాణికుల రద్దీ ఎక్కువగా పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని విశాఖ, విజయవాడ మధ్య ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను తీసుకువచ్చారు. కానీ నిర్వహణకు సిబ్బందిని కేటాయించలేదు. ఇప్పుడు సిబ్బంది కొరత పేరుతో భువనేశ్వర్‌కు తరలించాలని బిజెపి ప్రభుత్వం చూస్తున్నది. ఇప్పటికే రేల్వేజోన్ పేరుతో తలలేని మొండాన్ని ఏపీకి ప్రకటించారు, ఇప్పుడు రైళ్ళ పొడింగిపు పేరుతో మోసగిస్తున్నారు. ఇప్పటికే విశాఖ ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ మొదలగు రైళ్లని భువనేశ్వర్‌కు తరలించారు. ఇప్పడు దీన్ని కుడా వారిపరం చేస్తున్నారు. ఇది కావాలనే బిజెపి ప్రభుత్వం సవతితల్లి ప్రేమ తో... ఉత్తరాంధ్ర అభివృద్ధికి అటంకాలు ఏర్పరుస్తోందని విమర్శించారు.

ఇప్పటికైనే ఇటువంటి నిర్ణయాలు మానుకోవాలని, ఉత్తరాంధ్ర అభివృద్ధికి అవసారనికి తగ్గ రైళ్లను కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) గ్రేటర్ విశాఖ నగర కమిటీ కార్యదర్శి గంగారావు డిమాండ్ చేస్తున్నారు.

## పైడిమాంబ ఆలయంలో దొంగతనానికి విఫలయత్నం

### దొంగకు దేహశుద్ధి.. పోలీసులకు అప్పగించిన స్థానికులు



విశాఖపట్నం: జీవీఎంసీ 67 వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం కూడలి వద్దనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ శాఖ శ్రీ పైడిమాంబ అమ్మవారి దేవస్థానంలో బుధవారం ఓ దొంగ హల్చల్ చేశాడు. ఆలయంలో దొంగతనానికి విఫలయత్నం చేశాడు . ఇది గమనించిన కొంతమంది స్థానికులు దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్ప గించారు.

అమ్మవారి ఆలయం వెనుక గేటును పగులగొట్టి అమ్మవారి హుండీ ఆభరణాలు, వెండి విగ్రహములు తీసుకెళ్తండగా స్థానికులు చాకచక్యంగా వ్యవ హరించి దొంగను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు .

సమాచారం అందుకున్న ఎయిర్ పోర్ట్ క్రైం విభాగం ఎస్ .ఐ మన్మధరావు సంఘటనా స్థలానికి చేరుకుని నిందుతుడ్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు .

### నర్సాపురంలో నేడు మరిడిమాంబ అమ్మవారి పండుగ

చోడవరం : మండలంలోని నర్సాపురం గ్రామంలో నేడు (గురువారం)మరిడిమాంబ అమ్మవారి పండుగ ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు దొడ్డి హనుమంతురావు తెలిపారు. పండుగ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## దోమల పై దండయాత్ర పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : వెలుగు ఏపీఎం సురేష్



అనంతగిరి మండల కేంద్రంలో వెలుగు ఏ పి ఎం సురేష్ ఆధ్వర్యంలో వెలుగు ఉద్యోగులందరూ ప్రజలతో కలిసి దోమల పై దండయాత్ర కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో లో వెలుగు ఏపీఎం సురేష్ మాట్లాడుతూ దోమల వలన ఎన్నో జబ్బులు ముఖ్యంగా మలేరియా వ్యాధి వస్తుందని కనుక దోమలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం వారు ఇచ్చిన దోమతెరలు వినియోగించుకోవాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మురుగు నీరు లేకుండా ఇంకుడు గుంతల త వ్వు కోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో లో వెలుగు సీసీ లు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు,

## జోరుగా బీజేపీ సభ్యత్వ నమోదు



విశాఖపట్నం: బుధవారం ఉదయం భారతీయ జనతా పార్టీ నగర కార్యాలయంలో నగర అధ్యక్షుడు వి. నాగేంద్ర ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి మాజీ పార్లమెంటు సభ్యులు మరియు జాతీయ కార్యవర్గ సభ్యులు డా. కంభంపాటి హరిబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా హరి బాబు మాట్లాడుతూ సంఘటనపర్వ్-2019 సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఈనెల 25వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు ప్రతి కార్యకర్త పూర్తి సమయం ఇచ్చి పని చేయాలని, ఇంటింటికీ వెళ్లి భారతీయ జనతా పార్టీ చేసిన మంచి పనులను భారతీయ జనతా పార్టీ ఈ రాష్ట్రానికి ఇచ్చిన వివిధ సంస్థలను గురించి, సంక్షేమ పథకాల గురించి వివరించి భాజపా సభ్యులుగా చేరి ఈ దేశ ప్రగతిలో వారిని కూడా భాగస్వాములు కావాలని తెలియజేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మరియు నగర సభ్యత్వ నమోదుప్రముఖ్ కాశీవిశ్వనాధ రాజు, నగర ప్రధాన కార్యదర్శి మరియు సభ్యత్వ నమోదు సహా ప్రముఖ్ ఎం రవీంద్ర రెడ్డి, బీజేవైఎం జాతీయ కార్యవర్గ సభ్యులు సురేంద్రమోహన్ , రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కెఎన్‌పి చక్రవర్తి , విజయ్ బాబు , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ వి ఎస్ ప్రకాష్ రెడ్డి, నరేంద్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## 8 లక్షల మందు గుండు సామాగ్రి స్వాధీనం

అనకాపల్లి : అక్రమంగా నిల్వ ఉంచిన మందు గుండు సామాగ్రి ని స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సి ఐ తాత రావు తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ స్థానిక దాసరి గెడ్డ రోడ్డు లోని ఒక గోడౌన్ లో ఎటు వంటి అనుమతి లేకుండా అక్రమంగా మందు గుండు సామగ్రిని ఉంచి విక్రయాలు సాగిస్తున్నారు అన్న సమాచారం తో మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఎస్ ఐ వెంకటేశ్వరరావు, స్వీటీ ల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా సుమారు 8 లక్షల సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. యజమాని వేగి సూర్య నాగ సుబ్రహ్మణ్యం పై కేసు నమోదు చేసినట్లు సి ఐ తాత రావు తెలిపారు.

## కణితి బేలన్సింగ్ రిజర్వాయర్, నరవ ట్రీట్‌మెంట్‌ప్లాంట్

- మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ల ద్వారా నీటిసరఫరా - ఏలేరు రిజర్వాయర్ అక్టోబరు నెలవరకు
- గోదావరి రివర్ లో డిశంబరు నెలవరకు - రైవాడ జలాశయంలో సెప్టెంబరు నెల వరకు
- మేఘాద్రిగెడ్డ జలాశయంలో సెప్టెంబరు నెలవరకు - తాటిపూడి రిజర్వాయర్‌లో అక్టోబరు నెలవరకు నీటి లభ్యత- విశాఖనగరానికి త్రాగునీటిసరఫరాకు లోపం లేదు - కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం : జివియంసికి త్రాగునీటిసరఫరాకు లోపంలేదని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కోన్నారు. కణితి బేలన్సింగ్ రిజర్వాయర్, నరవ ట్రీట్‌మెంట్‌ప్లాంట్, మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్లను బుధవారం ఆమె సందర్శించారు. కణితి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ ద్వారా స్టీల్‌ప్లాంట్‌కు సరఫరా అవుతున్న నీటిని పరిశీలించి వివరాలు తెలుసుకోన్నారు. రిజర్వాయర్‌కు చేరుతున్న నీటి వివరాలను యస్.ఇ పల్లంరాజును అడిగి తెలుసుకొన్నారు. ఏలేరు లెఫ్ట్ మెయిన్ కెనాల్ ద్వారా నగరంలోని త్రాగునీటి అవసరాలను 50 శాతం తీరుస్తోందని పేర్కోన్నారు. నగర శివారు ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీటిసరఫరా జరుగుతున్నట్లు వివరించారు. స్టీల్ ప్లాంట్‌కు 60 యం.జి.డిలు నీటిసరఫరా జరుగుతోందని జనరల్ మేనేజర్ రామానుజాచారి తెలిపారు. నరవ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లోని అన్ని విభాగాలను సందర్శించి నీటిశుద్ధి, సరఫరా వివరాలను పరిశీలించారు. తదుపరి మేఘాద్రిగెడ్డ జలాశయంను సందర్శించారు. ఏలేరు రిజర్వాయర్‌లో నీటి లభ్యత అక్టోబరు నెల వరకు గరిష్ట వాటర్ స్దాయి 86.56 మీటర్లు కాగా, ప్రస్తుతం బుధవారం నాటికి 76.02 మీటర్లు, గోదావరి నది గరిష్ట వాటర్ స్దాయి 18 మీటర్లు కాగా బుధవారం నాటికి 14 మిటర్లు, రైవాడ రిజర్వాయర్ 114 మీటర్లు కాగా బుధవారం నాటికి 99.90 మీటర్లు, మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో 61 అడుగులు కాగా బుధవారం నాటికి 45.8 అడుగులు, తాటిపూడి 297 అడుగులు కాగా బుధవారం నాటికి 257 అడుగులు నీటిస్దాయిఉన్నట్లు వెల్లడించారు. పర్యటనలో అడ్వయిజర్ జగన్‌మోహన్, యస్.ఇ పల్లంరాజు, ఇఇ రాజారావు, మురళి, అందరు వార్ సప్లయి సిబ్బంది పాల్గోన్నారు.



## రోడ్డు భద్రత అవగాహన సదస్సు




విశాఖపట్నం : రామటాకీస్ దరి శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాల విద్యార్థిని-విద్యార్థులు బుధవారం నాడు రోడ్డు భద్రత అవగాహన సదస్సు ను సత్యం జంక్షన్ వద్ద నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్ మేట్ ధరించాలని మరియు కారు నడిపే వాహనదారులకు సీటు బెల్టు ధరించాలని మరియు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అవి చేయకపోవడం వలన జరిగే ప్రమాదాల గురించి అవగాహన కలిగించారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ తమప్రయాణాన్ని కొనసాగించాలని వాహనదారులకు తెలియజేసారు. మొత్తం ఈ కార్యక్రమంలో 65మంది విద్యార్థిని-విద్యార్థులు పాల్గోనగా మరియు ద్వారక పోలీస్ స్టేషన్ యస్.ఐ. డి. తాతారావు గారు,ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్ రావు, ఎన్.ఎస్.ఎస్. పి.ఒ. డా ఎస్. శ్రీనివాస్ రావు మరియు అధ్యాపక, సిబ్బంది పాల్గోన్నారు.

# విజయభాను

## సంపాదకీయం

## సవరణలతో స.హ.చట్టం ఆమోదం

సమాచారహక్కు చట్టం (సవరణ) బిల్లును ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య లోక్‌సభ ఆమోదించింది. సమాచారహక్కు చట్టం అతిక్రమణలకు తావుకుండా చేస్తూ, పనితీరును మరింత మెరుగుపర్చేందుకే ఈ విధమైన సవరణలు చేయాల్సి వచ్చిందని కేంద్రం చెప్పుకొస్తున్నది. కాగా సవరణలతో కేంద్ర సమాచారహక్కు కమిషనర్, ఇతర కమిషనర్లు పూర్తిగా స్వతంత్రతను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, తద్వారా వారు పూర్తిగా అధికార పార్టీ చెప్పు చేతల్లో ఉండే దుస్థితి ఏర్పడుతుందని కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ప్రభుత్వం తలపెట్టిన సమాచారహక్కు చట్టం సవరణ బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపి క్షుణ్ణంగా చర్చించిన తర్వాతనే బిల్లును ప్రవేశపెట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేయటం సమంజసమే. అయినా లోక్‌సభలో అధికారపార్టీకున్న మెజారిటీ బలంతో బిల్లును ఏకపక్షంగా ముందుకు తీసుకుపోయే పరిస్థితిని సృష్టించినప్పుడు ప్రతిపక్షాలన్నీ మూకుమ్మడిగా సభ నుంచి వాకౌట్ చేశాయి. ప్రతిపక్షాలు ఇంత తీవ్రంగా వ్యతిరేకించినా ప్రభుత్వం మాత్రం వెనక్కితగ్గకుండా మూజువాణి ఓటుతో సహచట్టం సవరణ బిల్లు-2019కి ఆమోద ముద్రవేసింది. నిజానికి సమాచారహక్కు కేంద్ర కమిషనర్, సహచర పది మంది సమాచార కమిషనర్లకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర కమిషనర్ల హోదాను ఇస్తూ జీతభత్యాలు కూడా వారికుండే లాగానే నిర్ణయించి, రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు. వారి పదవీకాలం ఐదేండ్లుగా నిర్దేశించారు. తాజా సవరణ కారణంగా సమాచారహక్కు కమిషనర్ల పదవీకాలం, జీతభత్యాలు, విధులు అన్నీ కేంద్ర ప్రభు త్వ నిర్ణయం మేరకు అమలవుతాయి. దేశంలో సమాచారహక్కు చట్టం ఉనికిలోకి వచ్చిన ఈ దశాబ్దకాలంలో గణనీయమైన పాత్రను నిర్వహించిందని చెప్పవచ్చు. సహచట్టం కారణంగా ప్రభుత్వ పాలనావిధానాల్లో జవాబుదారీతనం, పారదర్శకత పెరిగి గుణాత్మక మార్పులకు కారణమైంది. 2-జీ స్పెక్ట్రమ్ లాంటి కుంభకోణాలు వెలుగుచూడటానికి కూడా ఈ చట్టమే కారణం. అయితే తమ లోగుట్టును బట్టబయలు చేసే సమాచారహక్కు చట్టాన్ని నీరుగార్చేందుకు కొందరు నాయకులు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అంటే ఒక కమిషనర్ పదవీకాలం, విధులు అన్నీ కేం ద్ర ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంటాయన్న మాట. ఈ క్రమంలో ఎవరైనా తమ పదవీకాలం పొడిగింపు కోసం కేంద్రానికి అనుకూలంగా వ్యవహరించక తప్పని పరిస్థితిని కల్పించటం సమాచారహక్కు చట్టం స్ఫూర్తిని, స్వతంత్రతను నీరుగార్చటమే. సమాచారహక్కు చట్టంలో సవరణలు తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ తలంపు వెనుక కేంద్ర ప్రభుత్వ కక్షపూరిత ధోరణి ఉన్నదనే విమర్శలున్నాయి. గతంలో సమాచారహక్కు చట్టం కమిషనర్ల చర్యలతో ఎదురైన ఇబ్బందులు, తమ అదుపాజ్ఞల్లో లేకుండా వ్యవహరించిన తీరుతో కేంద్రం ఈ చర్యకు ఉపక్రమించిందనే ఆరోపణలున్నాయి. సమాచారహక్కు చట్టం కిం ద ఓ ఆర్టీఐ కార్యకర్త ప్రభుత్వరంగ బ్యాంకుల దగ్గర అప్పులు తీసుకున్న రుణ ఎగవేతదారుల జాబితాను ఆర్బీఐని కోరారు. అలాగే బ్యాంకుల దగ్గర ఉన్న నిరర్థక ఆస్తుల వివరాలను చెప్పాలని కూడా దరఖాస్తు చేసుకున్నారు. కానీ ప్రభుత్వం ఆదేశం మేరకు విశ్వసనీయత దెబ్బతింటుందన్న సాకు చూపి ఆర్బీఐ ఆ అప్పు ఎగవేతదారుల జాబితాను వెల్లడించటానికి అంగీకరించలేదు. ఆర్టీఐ కార్యకర్త సుప్రీంకోర్టుకు వెళితే ఆర్బీఐని న్యాయస్థానం తీవ్రంగా మందలించి రుణ ఎగవేతదారుల జాబితాను ఇవ్వాల్సిందేనని తీర్పుచెప్పింది. మరో ఆర్టీఐ కార్యకర్త-ప్రధాని మోదీ పరీక్ష పాసైన నాటి 1978 సంవత్సరపు ఢిల్లీ యూనివర్సిటీ బీఏ విద్యార్థుల రికార్డులను కోరారు. సమాచార చట్టం కమిషనర్ కూడా ఆర్టీఐ కార్యకర్త కోరిన విధంగా జాబితాను ఇవ్వాల్సిందేనని విస్పష్ట ఆదేశాలు జారీచేశారు. అలా గే మరో సందర్భంలో పద్మ అవార్డుల ప్రకటనలో పాటించిన నియమాలు, పరిశీలనకు వచ్చిన పేర్ల వివరాలను మరో ఆర్టీఐ కార్యకర్త కోరారు. ఇలాంటి ఘటనలలో సమాచారహక్కు కమిషనర్లు వ్యవహరించిన తీరుతో కేంద్రం తీవ్ర సంకట పరిస్థితిని ఎదుర్కొన్నది. ఈ నేపథ్యంలోంచే సమాచార హక్కు కమిషనర్లను తమ అదుపాజ్ఞల్లో ఉంచుకునేందుకే ప్రస్తుత సవరణ బిల్లును తెస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దేశంలో సమాచారహక్కు చట్టం ఉనికిలోకి వచ్చిన ఈ దశాబ్దకాలంలో గణనీయమైన పాత్ర ను నిర్వహించిందని చెప్పవచ్చు. సహచట్టం కారణంగా ప్రభుత్వ పాలనావిధానాల్లో జవాబుదారీ తనం, పారదర్శకత పెరిగి గుణాత్మక మార్పులకు కారణమైంది. 2-జీ స్పెక్ట్రమ్ లాంటి కుంభకోణాలు వెలుగుచూడటానికి కూడా ఈ చట్టమే కారణం. అయితే తమ లోగుట్టును బట్టబయ లు చేసే సమాచారహక్కు చట్టాన్ని నీరుగార్చేందుకు కొందరు నాయకులు ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.



విశాఖ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ తొలి చైర్మన్‌గా నియమితులైన ద్రోణంరాజు శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం యువజన విభాగం అధ్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ

## వాడచీపురుపల్లిలో అర్వోప్లాంట్ పునఃప్రారంభం



పరవాడ : పరవాడమండలము వాడచీపురుపల్లి పంచాయితీలో గత నాలుగు నెలలుగా ఆగిపోయిన వాటర్ అర్వో ప్లాంట్ కు వైయస్సార్ సిపి నాయకులు బురద రాజు, తాతాజీ ,భూస రాజు వారి సమక్షంలో స్థానికఎమ్మెల్యేఅదీప్ రాజు చొరవతో 95000 సుమారు ఖర్చు వెచ్చించి రిపేరు చేయించారు. ఈవాటర్ ప్లాంట్ ను బుధవారము స్థానికవైసిపి నాయకులు బురదరాజు ముఖ్యఅతిథిగాహజరై అయనచేతులు మీదగా అర్వో ప్లాంట్ నుపునఃప్రారంభించారు. ఈకార్యక్రమంలోవాడ చీపురుపల్లి నాయకులు బండి ముత్యాలు ,రాము, సోమ నాయుడు నెంబర్ రాజు మరియు ముఖ్యనాయకులు తథితర్లు పోల్గోన్నారు.

## అడివివరం శాఖా గ్రంథాలయంలో పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతోత్సవం



సింహాచలం :72 వ వార్డు అడివివరం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుఁడు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 129 వ జయంతి ఘణంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమానికి అతిథు లు వి బి రాజేంద్రప్రసాద్ జి వి యెన్ ఆచార్యుల రాజు వినోద్ సుధీర్ పాల్గొనగా ఈ సందర్బంగా అతిధులు మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉద్యమానికి అయ్యంకి మూలపురుషుడని స్వాతంత్ర సమరయోధులకు గ్రంథాలయాన్ని వక ఆయుధంలా అందించిన విప్లవజ్యోతి అంధ్రప్రదేశ్ గ్రంధాలయ సంఘాన్ని దేశస్థాయిలో అఖిలభారత గ్రంధాలయాలని స్థాపించారని నవంబర్ 15 నుండి 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు ఆయన స్ఫూర్తితో జరుపుతున్నామని పలువురు వ్యాఖ్యానించారు ఈ కార్యక్రమం గ్రంథాలయ అదికారి పి వి నూకరాజు అధ్వర్యంలో జరగగా దేవస్థానం పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సత్యదేవుని నిత్య అన్నదాన పధకానికి రూ.1,01,116/-విరాళం



అన్నవరం..... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకముగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పధకానికి తూర్పుగోదావరి జిల్లా ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కొమ్ముల.బొజ్జిబాబు రూ.1,01,116/- విరాళమును దేవస్థానం ఏసి రమేష్ బాబు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో మార్చి 5వ తేదీన అన్నదానం జరిపించవలెనని కోరారు.

## అధిక డబ్బులు వసూలుచేస్తే సహించేది లేదు

## మీ-సేవ ప్రతినిధులపై తహశీల్దార్ ఫైర్



పరవాడ : పరవాడ మండలములోగల మీసేవను నడిపేప్రతినిదిలుతో బుదవారము తహశీల్దార్ కార్యల యంలో సమావేశము ఏర్పాటు చేసారు. ఈసమావేశంలో తహశీల్దార్ గంగాదర్ రావు మాట్లడుతూ మీసేవ ప్రతినిదిలుపైపలుపిర్యాదులు వస్తున్నాయనీ, దృవపత్రాలుమీసేవలో అప్లైచేయడానికి ిగానూనిర్దేశించిన డబ్బులుకన్న అదికమెత్తం లోవసూలుచేస్తున్నారనీ పిర్యాదులు వస్తున్నాయనీతెలిపారు. ఇకపై ఏమీసేవ ప్రతినిది అయిన అదికమెత్తములో డబ్బులువసూలుచేస్తే ఎంతటివారైన సహించేదిలేదునిహెచ్చరించారు. ప్రతిమీ ేవ కేంద్రములోని ఏదృవపత్రానికి రేటుఎంతఅని బోర్డుపెట్టాలనీ తెలిపారు. నిర్దేశించిన సమయానిక ిప్రతిఓక్కరికి దృవపత్రాన్ని అందజేయాలనీఅన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ వరహాలరావు జూనియర్ అస్టెంట్ కుమార్ తథితర్లు పోల్గోన్నారు.

## కార్డియాలజి సేవలు భేష్

### కలెక్టర్ వినయ్ చంద్



విశాఖపట్నం : కింగ్ జార్జ్ హాస్పిటల్ లో కార్డియాలజి సేవలు బాగున్నాయని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ పేర్కొన్నారు. బుధవారం కెజిహెచ్ లో ఆయన వార్డుల వారీగ సందర్శించారు. కార్డియాలజీ క్యాత్ ల్యాబ్ చాలా బాగుందని, సర్వీసులు కూడా బాగా అందిస్తున్నారని ఆయన కొనియాడారు. డా. రాజేష్ గుండెలోని బ్లాక్ లు ఏ విధంగా ఏర్పడుతున్నవి, బ్లాక్ లు తీసిన తరువాత గుండె ఏ విధంగా పనిచేస్తున్నది ఆయన కలెక్టర్ కు వివరించారు. ముందుగా కార్డియాలజి వార్డును సందర్శించి తగరపువలస నుండి ఎం గోవిందరావు అనే పేషెంటు ఆరోగ్యం ఏలా ఉంది, డాక్టర్లు బాగా చూస్తున్నారా లేదని ఆయన అడిగి తెలుసుకున్నారు. గైనిక్ వార్డు మేటి-1, మేటి-2 లను సందర్శించి పెదవాల్తేరుకు చెందిన కె. మాధవి డెలివరి కేసుకు సంబందించి నార్మల్ డెలివరీ లేదా ఆపరేషన్ చేశారా అని అడుగగా నార్మల్ డెలివరి అయినట్లు కె. మాదవి చెప్పారు. డెలివరీ అయిన పాపను ఆయన ఎత్తుకుని మురిసిపోయారు. అక్కడే ఉన్న సఖీ ఒన్ స్టాఫ్ సెంటర్ ను ఆయన సందర్శించి ఎక్కువగా ఏ ఏ కేసులు వస్తాయని, ఇక్కడకు వచ్చే వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారా, లేదా, వారిని బాగా చూసుకుంటున్నారా లేదాని అడిగి తెలుసుకున్నారు. జనన ధృవీకరణ కేంద్రాన్ని సందర్శించి రోజుకు ఎన్ని సర్టిఫికేట్లు జారీ చేస్తున్నది ఆయన అడిగి తెలుసుకున్నారు. వార్డులకు బయట ఉన్న పైపులైన్లు లీకేజిలు ఉన్నవాటిని చూసి లీకేజీలు లేకుండా చూడాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఇంత వరకు ఎంత ఖర్చు అయినది ఎపిఎంఎస్ఐడిసి డిఇ డి.ఎ. నాయుడుని ఆయన అడుగగా ఇంత వరకు 20 కోట్ల రూపాయలు ఖర్చు అయినదని చెప్పారు. ఈ భవనంపై 26వ తేదీన సమావేశం ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్ జి. అర్జన ను ఆయన ఆదేశించారు. పిడియాట్రిక్ వార్డులోని వైరల్ ఫివర్ తో బాదపడుతున్న బాలిక తల్లిని జ్వరం తగ్గిందా లేదా అని అడుగగా బాగా తగ్గిందని చెప్పారు. వార్డులను ఆయన క్షణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్శనలో సిఎస్ఆర్ఎంఓ కె. అంజిబాబు, ఆర్ఎంఓ లు డా. సాధన, డా. దొర, గైనిక్ విభాగానికి సంబంధించి డా.ఎల్. ఝాన్సీ రాణీ, డా. పద్మలత, డా. ఎల్. ఉమ, డా. నాగమణి, పిడియాట్రిక్ విభాగానికి సంబంధించి డా.సర్జ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## పాడిరైతుల పిల్లలకు హెరిటేజ్ ఉపకారవేతనాలు

### హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు

అచ్యుతాపురం : పాడిరైతుల అభివృద్దే హెరిటేజ్ డెయిరీ లక్ష్యమని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు అన్నారు .బుధవారం మండలంలో రామన్నపాలెం గ్రామ హెరిటేజ్ పాడిరైతుల పిల్లలకు ఉపకారవేతనాలు ఆయన చేతులు మీదుగా పంపిణి చేశారు .ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పాడిరైతులకు హెరిటేజ్ డెయిరీ అధిక ధరను చెల్లిస్తూ ,రాయితీపై దాణా ,ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు .ఈ కార్యక్రమంలో చిన్నరాము , శ్రీను ,అప్పారావు తదితరులు పాల్గొన్నారు .

## నార్త్ జోన్ ఎసిపి గా ఆర్ రవి శంకర్ రెడ్డి



మధురవాడ మధురవాడ ఎసిపి కార్యాలయంలో బుధవారం నార్త్ జోన్ ఎసిపిగా ఆర్ రవి శంకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు, ఈ సందర్భంగా పీఎం పాలెం, భీమిలి ఆనందపురం, పద్మనాభం స్టేషన్ల సీఐలతో సమావేశమయ్యారు అనంతరం శాంతిభద్రతలకు సంబంధించి భీమిలి నియోజకవర్గ పరిధిలో పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అందరికీ సమన్యాయం రక్షణ కల్పించవ లసిందిగా ఆదేశించారు. నేర విభాగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చెయ్యాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పందన ద్వారా ప్రజలతో మమేకమై తక్షణమే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు స్పందన కార్యక్రమం కొరకు ప్రతి సోమవారంతో పాటు అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన ఆర్ రవి శంకర్ రెడ్డి తెలిపారు.

# విమ్స్‌లో కలెక్టర్ అకస్మిక తనిఖీలు



## విమ్స్ హాస్పిటల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి కలెక్టర్ వినయ్ చంద్



విశాఖపట్నం : విమ్స్ హాస్పిటల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెల్లనున్నట్లు జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ చెప్పారు. బుధవారం విమ్స్ హాస్పిటల్ ను ఆయన జివియంసి కమీషనర్ డా.జి. సృజనతో ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా వార్డుల వారీగ ఆయన సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఆపరేషన్ థియేటర్ లో ఉన్న సౌకర్యాలుపై ఆయన ఆరా తీసారు. హాస్పిటల్ నిర్మాణం, తదితర విషయాలపై విమ్స సంచాలకులు డా. కె. సత్య వర ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు. సూపర్ స్పెషాలిటీలో ఏమి ఏమి ఉన్నదీ ఆయన అడుగగా న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, యూరాలజి, తదితరమైనవి ఉన్నాయని సంచాలకులు సత్యవర ప్రసాద్ వివరించారు. హాస్పిటల్ లో సోలార్ ఏర్పాటు చేయడమైనదని, దీని వలన విద్యుత్ చార్జీలు సేవ్ అవుతున్నాయని సంచాలకులు చెప్పారు. కార్డియాలజీకి సంబంధించిన కేసులు వస్తే ఏమి చేస్తారని కలెక్టర్ అడుగగా ఆ కేసులు వస్తే కె.జి.హెచ్. కు పంపుతామని చెప్పారు. సిటి స్కాన్, స్కాన్, పరీక్షల చార్జిల గూర్చి అడుగగా వై.యస్.ఆర్. ఆరోగ్య శ్రీ, సిజిహెచ్, జర్నలిస్టుల హెల్త్, తదితర వాటికి ఉచితంగా ఉంటాయని, అవుట్ పేషెంట్లకు తగ్గింపు ధరలు ఉంటాయని చెప్పారు. స్టాఫ్ నర్సులు శ్రీకాకుళం, కాకినాడ నుండి డెప్యుటేషన్ పై పనిచేస్తున్నట్లు ఆయన వివరించారు. హాస్పిటల్ లో ఉన్న ఖాళీలను భర్తీ చేయువలసినదిగాను, విమ్స లో ఉన్న వైద్య సదుపాయాల గురించి, రోగులకు అందిస్తున్న అత్యున్నత సేవల గురించి ఆయన వివరించారు. విమ్స ను ప్రభుత్వం సహకారంతో హైదరాబాద్ లో ఉన్న నిమ్స్, తిరుపతిలో ఉన్న స్విమ్స్, తరహాలో అభివృధ్ధి చేయుటకు కృషి చేయనున్నట్లు కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఆర్ఎంఓ డా. చక్రవర్తి, డా. శోభారాణి, జివియసి సియంఓ డా. హేమంత్, డా. విజయ్, డా. చౌదరి, డా. రాజేశ్వరి, జివియంసి బయాలిజిస్ట్ డా. పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.



రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను క్లాసిఫైడ్స్ Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2560004

# నిరుద్యోగుల సబ్సిడీ రుణాలకు 100కోట్లు కేటాయించాలి



విశాఖపట్నం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగుల సబ్సిడీ రుణాలు కోసం వంద కోట్లు కేటాయించాలని ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గంట్యాడ శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. దొండపర్తి అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉద్యోగాలు రావాలంటే ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయాలని కోరారు.

## సమత కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రీసైక్లింగ్ పై అవగాహన ర్యాలీ



విశాఖపట్నం : సమత కళాశాల యూనిట్ -1, యూనిట్ -2 ఆధ్వర్యంలో బుధవారం నాడు రీసైక్లింగ్ (పునఃచ్మరన ) ఆఫ్ పేపర్, బుక్స్ వీ.ఫై. పై భారీ ర్యాలి నిర్వహించడం జరిగింది ఇందులో భాగంగా సుమారు 200 చీూ వాలంటీర్స్ చే రీసైక్లింగ్ పై అవగాహనా తెలుపుతూ మరియు పేపర్ ని రీసైక్లింగ్ చెయ్యండి ఆలోచనల్ని కాదు చురుకుగా ఆలోచిద్దాం చలాకిహ రీసైక్లింగ్ చేద్దాం. రీసైక్లింగ్ పతిఒక్కరి భాధ్యత ఈ స్లొగన్స్ ను తెలుపుతూ వాటి ఒక్క ప్రాముఖ్యతను గుర్తించడం జరిగింది. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ .విజయ రవీంద్ర మాట్లాడుతూ చీూ విద్యార్థులతో పాటు ప్రతి విద్యార్థి తప్పని సరిగా దీనిని పాటించాలని కోరుకుంటున్నాము మరియు మన భవిష్యత్తు రీసైక్లింగ్ మీదే ఆధారపడి ఉంది, వాడేసిన పేపర్ ని రీసైక్లింగ్ చేద్దాం చెట్లని కాపాడుదాం భావిష్యత్తుని సరిదిద్దుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల డైరెక్టర్ డా.జి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్ బి.రాజేష్ కుమార్, జి.వెంకటేశ్వరావు మరియు అధ్యాపకులు, నాన్-టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుటకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి



### జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము

సబ్బవరం : పర్యావరణాన్ని పరిరక్షించుటకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా వైసిపి బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము పేర్కొన్నారు.మండలంలోని అసకపల్లి పంచాయితీలో నక్కవానిపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో బుధవారం మదర్ ఛారిటబుల్ అధ్యక్షులు వి.గంగరాజు మాష్టారు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము, బర్నికాన సాయినాధరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుటకు పర్యావరణాన్ని రక్షించుటకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంక్షరించాలని ప్రజలను కోరారు. మండలంలో మదర్ ఛారిటబుల్ ట్రస్ట్ చేసిన సేవలను కొనియాడారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో ఇంకా అనేక సేవా కార్యక్రమాలు చేయాలని వారికి మా సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణలో సుమారు 50 మొక్కలు కొటాన రాము, బర్నికాన సాయినాధరావు చేతుల మీదుగా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.లక్ష్మి కుమారి, కె.సూర్యనారాయణ, మరియు వైసిపి నేతలు హేమంత్ కుమార్, తుంపాల అప్పారావు, పార్టీ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పోలీస్ అరెస్ట్ రిమాండ్ కు తరలింపు



విశాఖపట్నం : శాంతిభద్రతలను కాపాడవలసిన పోలీసుల మాదిరిగా ఓ నకిలీ పోలీసు అవతార మెత్తాడు. ఈమేరకు నగరంలో యదేచ్ఛగా తిరుగుతూ ఎట్టకేలకు ఎయిర్ పోర్ట్ పోలీసులకు చిక్కాడు ..చెల్లబోయిన లోచన కుమార్ (19) తాను పోలీసు నని చెప్తూ పలువురు దగ్గర లంచాలు తీసుకుంటూ అదేవిధంగా కొందరికి పోలీసు శాఖలో ఉద్యోగాలిప్పిస్తానని వెల్లబుచ్చాడు అయితే నేపద్యంలో పలువులు పిర్యాదు మేరకు చాకచక్యంగా వ్యవహరించిన ఎయిర్ పోర్ట్ పోలీసులు నిఘాపెట్టి అతడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

## గ్రామసచివాలయ పోస్టుల నిమిత్తం పరిశీలన

అనంతగిరి : అనంతగిరి మండలం లో గ్రామసచివాలయ పోష్టుల నిమిత్తం వ్రాత పరీక్షల నిమిత్తం పరిశీలించడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు. అనంతగిరి మండలం - జిల్లా కలెక్టర్ విశాఖపట్నం వారి ఆదేశాల ప్రకారం గ్రామ సచివాలయ పోస్టులు నియామకమునకు సంబంధించి రాత పరీక్షలు రాయుటకు పరీక్ష కేంద్రముల పరిశీలన నిమిత్తం ప్రభుత్వ జూనియర్ కళాశాల అనంతగిరి,గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలికలు మరియు బాలురు )కొత్తవలస ఆశ్రమ పాఠశాలలను తహసీల్దార్ శ్రీ.ఎమ్.వి.వి.ప్రసాద్, ఎమ్.పి.డి.వో ఎ.వి.వి.కుమార్,ఎమ్.ఇ.వో. లబుడుబారికి. వెంకట్రావు, ఈవోపీర్డి.బత్తుల మల్లేశ్వరరావు పరిశీలించడమైనదని అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవివి కుమార్ తెలిపారు,

# విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసిన జయవీర్



అనకాపల్లి : పట్టణంలోని గవరపాలెం శతకం పట్టు వద్ద ఉన్న కనకదుర్గ గుడి వద్ద పేద పిల్లలకు పుస్తకాలు పంపిణీ జరిగింది. కనకదుర్గ అమ్మవారి ఆలయ చైర్మన్ దాడి జయవీర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, దాడి కృష్ణ, బాల, తదితరులు విద్యార్థులకు ఈ పుస్తకాలను అందజేసారు. ఈసందర్భంగా సుమారు 50 మంది విద్యార్థిని, విద్యార్థులు వీటిని పొందారు. ఈ కార్యక్రమంలో పివి రమణ, స్థానిక యువకులు, పాల్గొన్నారు.

# లైఫ్‌టాక్స్ పాత పద్ధతిలోనే కొనసాగించాలి



అనకాపల్లి : వాహనాలకు లైఫ్‌టాక్స్ పాత పద్దతిలోనే కొనసాగించే విదంగా చర్యలు తీసుకోవాలని, అనకాపల్లి నూకంబిక గూడ్స్ ఆటో యూనియన్ డిమాండ్ చేసింది. బుధవారం విశాఖ మోటర్ ట్రాన్స్‌పోర్టు ఓనర్స్ & వర్కర్స్ యూనియన్ (సిఐటియూ) స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద డ్రైవర్లు దర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేసారు. ఒకే సారి లైఫ్ టాక్స్ కట్టాలని ఒత్తిడి తేవడం మూలంగా 20,వేల నుంచి 30 వేల రూపాయల వరకు భారం పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేసారు. దీని వలన తీవ్ర ఆర్ధిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఉపాధి కల్పించకపోవడం వలన బ్యాంకుల నుండి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుండి అప్పులు తీసుకుని టాటా ఏసీ, బోలోర్, లైలాండవంటి మీనీ 4 వీలర్స్ కొనుక్కుని జీవనోపాది పొందుతున్నామన్నారు. ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మూడు నెలలకొకసారి లైఫ్ టాక్స్ చెల్లించే విదానం ఉందన్నారు. ఇప్పుడు లైఫ్ టాక్స్ 15 సంవత్సరాలకు ఒకే సారి చెల్లించాలని అధికారులు ఒత్తిడి తేవడం వలన తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించాలని, కోరారు. ఈ కార్యక్రమంలో దాకారపు శ్రీనివాసరావు, డి. శ్రీనివాస్, కె.వి. స్వామి, ఎ. బాలకృష్ణ పాల్గొన్నారు.

## పబ్లిక్ సర్వెంట్ ప్రెసిడెంట్‌గా ఆదినారాయణ



యానాం : యానాంలో పలు ప్రభుత్వ కార్యలయాలకు సంబంధించి ఈ నేల 16న జరిగిన పబ్లిక్ సర్వెంట్ ఎన్నికలలో ఏడుగురు డైరెక్టర్లు ఎన్నికజరిగింది ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ కోసాదికారి మధ్య జరిగిన పోటీలో పోలిశెట్టి ఆదినారాయణ (ఆది బాబు) ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారు పొలిమారి శ్రీను వైస్ ప్రెసిడెంట్ కటికదల విజయలక్ష్మి ట్రెజరర్ గా ఎన్నికయ్యారు డైరెక్టర్ గా విళ్ళ శ్రీనివాస్ నీ మిత్రులయ్యారు కోపరేటివ్ ఆఫీసర్ లంక విద్యాసాగర్ సమక్షంలో ఎన్నిక ప్రశాంతంగా పూర్తయింది.

### అగ్నిప్రమాద బాధితులకు

## లైన్స్ క్లబ్ సాయం అందజేత



యానాం : యానాం నియోజకవర్గంలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మూడు కుటుంబాలకు యానం లైన్స్ క్లబ్ ప్రతినిధులు బుద వారం సాయం అందజేశారు స్థానిక పెరి రోడ్డులోని జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన పెమ్మాడి విష్ణు ,బి పద్మావతి, మల్లాడి సత్యవతి, ఓలేటి లక్ష్మీ ,బి లోవరాజు తదితర కుటుంబాల వారికి ఒక్కొక్కరికి 25 కేజీలు బియ్యం స్కూల్ బుక్స్ స్కూల్ బ్యాగ్ లతోపాటు ఒక్కో కుటుంబానికి వెయ్యి రూపాయల నగదును అందజేశారు నూతన అధ్యక్షుడు వంకాయల నరేందర్ ఆధ్వర్యంలో కార్యదర్శి పడాల గోపాలం సహాయ సహకారాలు అందించిన ముదునూరి సహదేవ రాజు ,సలాది గుప్త ,,కాపగంటి ప్రవీణ్ ముమ్మిడి చిన్నారి కంచర్ల లక్ష్మీనారాయణ చిక్కాల నరసింహమూర్తి పాల్ నా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సీఎం జగన్ ప్రవేశపెట్టిన మహిళా బిల్లు ఆనందదాయకం



విశాఖపట్నం : విశాఖ నగర పార్టీ కార్యాలయంలో నగర మహిళా విభాగం అధ్యక్షురాలు గరికిన గౌరీ ఆధ్వర్యంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో గరికిన గౌరీ మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డికి మహిళా వర్గంలు తరుపున కృతజ్ఞతలు తెలిపారు.. మాహిళలకు బాసట గా ఈ బిల్లు ఉంది అని, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో, నామినేటెడ్ పనుల్లో మహిళకు 50 శాతం రిజర్వేషన్ వర్తింపు బిల్లు ఏర్పాటు చేయడం తో పాటు వై.యస్.ఆర్ ఆసరా ద్వారా ఎస్.సి, ఎస్.టి, బి.సి మహిళక 75 వేల రుపాయులు ఉచితంగా ఇవ్వడం చాలా ఆనంద గా ఉంది అని తెలిపారు. అనతరం వై.యస్. జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి పాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ మాహిళ విభాగం కార్యదర్శి షబిరా బేగం, అసెంబ్లీ మహిళా విభాగం ఇంచార్జ్ కృప జ్యోతి, నిలపు లక్ష్మి, నగర కమిటి సభ్యులు రత్నం, శేశికల, అనురాధ, వార్డు పార్టీ మహిళా విభా గం అధ్యక్షురాలు పల రత్నం, బొట్ట సవర్ణ, జుత్తు లక్ష్మి, నాగ మణి, రాములమ్మ, చిన్నమ్మలు, వెంకట లక్ష్మి, వరలక్ష్మి, వెంకట లక్ష్మి, శేబెస్గం, సరస్వతి, అనురాధ, పార్వతి, ఎస్ నూక రత్నం, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సిరాజుద్దీన్ మృతి



యానాం : యానాం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మైనార్టీ కులాల కాజాఎమ్ ఎ సిరాజుద్దీన్ అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు ఇటీవల కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్న సిరాజుద్దీన్ మృతి పట్ల పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, స్థానిక నాయకులు తదితరులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

### ద్విచక్రవాహనం అదుపుతప్పి

## వృద్ధునికి తీవ్రగాయాలు

### హైవే పెట్రోలింగ్ పోలీసుల చొరవతో ఆసుపత్రికి తరలింపు



**తీవ్ర గాయాలతో ఉన్న వృద్ధుడిని చోడవరం ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం**

చోడవరం: చోడవరం-వడ్డాది ప్రధాన రహదారి లక్ష్మీపురం కళ్ళాలు వాటర్ ప్లాంట్ సమీపంలో చీడికాడ మండలం, వీరభద్రపేటకు చెందిన వృద్ధుడు డోకల దేముడు బుధవాం సాయంత్రం ద్విచక్ర వాహనంపై చోడవరం వైపు వస్తూ అదుపుతప్పి రహదారిపై పడటంతో అతనికి తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ ఎస్.ఐ, బోడిరాజు, హొంగార్డు వెంకటరమణ స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడుని చోడవరం సి.హెచ్.సి.కి తరలించి వైద్యం అందించారు. తలకు బలమైన గాయం కావడంతో ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనకాపల్లి ఎన్.టి.ఆర్ ఆసుపత్రికి తరలించారు. పెట్రోలింగ్ పోలీసుల చొరవ చూపడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## మహాప్రభో జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ కాలనీలో గల సమస్యలు పరిష్కరించండి

### అధికార్లకు వైసీపీ నాయకులు గోపి వినతి



పరవాడ: పరవాడ మండలము జెఎన్ఎన్‌యుఅర్ ఎమ్‌కాలనీలోగల సమస్యలు పరిష్కరించాలనీ కోరుతూ బుధవారము వైసిపినాయకులుగోర్లిగోపి ఎమ్ పిడిఒ కరుణాకుమారికి వినతిపత్రము అందజేసారు.జెఎన్ ఎన్ యుఅర్ ఎమ్ కాలనీలో డ్రైనేజు బాగోలేదుని,పారిశుద్యము మెరుగుపరచాలనీకోరారు.సుమారు 150 వీ ది దీ పా ల ు ప ని చే య ు ట వ ు లే ద ు ని అన్నారు.వీదిదీపాలుపనిచేయకపోవటము వలనరాత్రివేళల ప్రజలుఇబ్బందులు పడుతున్నారనీఅన్నారు. ఈసమస్యను త్వరతగతంగాపరిష్కరించాలనీ కోరారు. పారిశుద్యము మరాయు వాటర్ పంపుహౌసు అపరేటరుకు నవంబర్ నుండి జీతాలు ఇవ్వకపోవుటము వలన పనులు సరిగ్గా జరగటములేదునితెలిపారు. గతనెలలో బ్లాక్ నెంబర్ 56,57,58 గల వాళ్ళుకీ డెంగ్యూ జ్వరాలు వచ్చి అస్పత్రి పాలైన్నారనీ పేర్కొన్నారు.పైన తెలిపిన సమస్యలు అన్ని త్వరతగతంగా పరిష్కరించాలనీ వైసిపినాయకులుగోర్లి గోపి అదికార్లును కోరారు.

## జెసి-2 సేవలు మరువలేం : జిల్లా కలెక్టర్



విజయనగరం: మితభాషి, కష్టించి పనిచేసే స్వభావి, 13 నెలల కాలంలో ఎన్నో సమర్ధవంతమైన సేవలు అందించిన జాయింట్ కలెక్టర్-2 సీతారామారావు ఎంతో ఆదర్శనీయులని జిల్లా కలెక్టర్ హరిజవహర్‌లాల్ కొనియాడారు. ఆర్డీఓగా తాను ఇష్టప్రకారం బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా అధికార యంత్రంగం ఘనంగా ఆయనని సత్కరించింది. ఈ సందర్భంగా కలెకటర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో, మెగా మేళ, విద్యాశాఖ వ్యవహారాల్లో విత్తన పంపిణీ అంశాల్లో జిల్లా యంత్రాంగానికి వారు అందించిన సహకారం మరువలేమని అన్నారు. సత్మానగ్రహీత సీతారామారావు మాట్లాడుతూ ఉద్యోగరీత్య వెళుతున్నాని..జిల్లా ప్రజల , అధికారుల ఆదరాభిమానాలు మరువలేమని కృతజ్ఞతలు తెలిపారు.

# జెడ్.పి.టీ.సి,ఎం.పి.టి.సీ,ల పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



చోడవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్.పి.టీ.సీ, ఎం.పి.టీ.సీల పోలింగ్ కేంద్రాల జాబితాను బుధవారం విడుదల చేశారు. ఎం.పి.డీ.వో దుర్గాశ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో పంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల చేసి, ఆయా పంచాయతీలలో నోటీస్ బోర్డులో ప్రచురించనున్నారు. మండలంలోని మొత్తం 69 వేల 323 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 34,022, మహిళా ఓటర్లు 50,507, ఇతరులు 4 మంది ఉన్నట్లు ఎం.పీడీవో తెలిపారు. మొత్తం 81 పోలింగ్ స్టేషన్లు ఎంపిక కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో.పి.ఆర్.డి చైతన్య, సూపరెంటెండెంట్ సుందర్ రాజు, సీనియర్ అసిస్టెంట్ రామారావు, సంతోష్, చోడవరం పంచాయతీ ఈవో లవరాజు,ఎన్.ఆర్.ఈ.జి.ఎస్, ఏపీవో గోవిందరావు, పంచాయతీ సెక్రటరీ జె.ఏ.వి.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

### జిల్లా శక్తి టీమ్ సమన్వయకర్త రాములమ్మ

నర్సీపట్నం : కళాశాలలలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌ల వంటివి చేయడం, ప్రోత్సహించడం నిషిద్ధమని, ఇటువంటివి చేసే వారిని కఠినంగా శిక్షించే చట్టాలు ఉన్నాయని జిల్లా శక్తి టీమ్ సమన్వయకర్త, ఎస్. రాయవరం ఏఎస్సై రాములమ్మ అన్నారు. బుధవారం నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారితా విభాగం, రక్షణ చట్టాల పై బాలికలకు అవగాహన అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గన్న రాములమ్మ మాట్లాడుతూ పార్లమెంట్ 2013లో చేసిన చట్టం వలన మహిళలకు మరింత రక్షణ కలిగిందని, కాబట్టి మహిళలు ఈ విషయంలో అవగాహన పెంచుకొని ఎక్కడికక్కడ తమ సమస్యలు పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలన్నారు. దీని కోసం ప్రభుత్వం ఇటీవలే శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసిందని, ఈ టీములు కళాశాలలు, బస్టాండ్‌లు, సినిమా థియేటర్లు దగ్గర ఎప్పుడు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# దేశానికి వెన్నెముక లాంటి రైతును ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం శ్రీకారం

## బీసీ సెల్ అధ్యక్షులు కొటాన రాము



సబ్బవరం : దేశానికి వెన్నెముక లాంటి రైతులను ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆదిరెడ్డి పాలెంలో భూ సర్వేతో బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము పేర్కొన్నారు. మండలంలోని ఆదిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారులు భూసర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి బిసి సెల్ అధ్యక్షులు కొటాన రాము పాల్గొని ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం నవరత్న పథకాలలో భాగంగా రైతుభరోసా కార్యక్రమం చేపట్టిందని, సమగ్ర భూసర్వే జరిపి ఆన్‌లైన్‌లో రైతు పాసుబుక్ వచ్చేలా ఎవరి భూములు వారికి కేటాయించేలా చేస్తుందని రైతుకు భరోసా ఇచ్చారు. పార్టీలకు అతీతంగా మా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. గత టిడిపి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించిందని ఎవరి ఖాతాలో వారికి చెందేలా వైసిపి ప్రభుత్వం సంవత్సరానికి 12,500 జమ చేస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సర్వే కార్యక్రమంలో అందరూ పాల్గొని సహకరించవలసినదిగా రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొటాన కోటయ్య, బండారు దేముడుబాబు, కొటాన సత్యం, కొటాన ఫణీంద్ర, బైలపూడి దేముడుబాబు, గొర్లె ప్రసాద్, మండల విద్యార్థి విభాగం అధ్యక్షులు హేమంత్, విఆర్వో శేషు, సర్వేయర్ రాంబాబు, విఆర్ఏ అప్పారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వివేకంతో కూడిన విద్య ప్రభుత్వ పాఠశాలలతోనే సాధ్యం



విశాఖపట్నం : బాలల్లో చక్కని వివేకం చూడాలనుకునే తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్చేలా ముందుకు రావాలని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు శీతారాం అన్నారు. బుధవారం నక్కవానిపాలెంలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా డా.గొండు శీతారాం, డా.బి.రమేష్‌బాబుల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సిఆర్‌పిఎఫ్ రాష్ట్ర అధ్య క్షుడు గొండు శీతారాం విద్యార్థుల నుద్దేశించి మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు అన్ని రంగాల్లోను అధిగమించ గలరన్నారు. ప్రభుత్వం పౌష్టికాహారం, వ్యాయామంపై ప్రత్యేక దృష్టి, చక్కని దుస్తులు, ఆరోగ్యవంతమైన భోజన పథకం మెనూల అమలు వల్ల పిల్లల్లో ధైర్య సాహసాలతో కూడిన ప్రతిభను కనబరిచే విద్య అలవడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు కొల్లి బసవ పూర్ణయ్య, ఉపాధ్యాయులు ఎస్.గిరిజాక్షి, పి.శ్రీదేవి, మహమ్మద్ మైమూనా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి కూరగాయల మార్కెట్‌కు స్వచ్ఛ అవార్డు



అనకాపల్లి : అనకాపల్లి గాంధి మార్కెట్‌కు 2019 వ సంవత్సరానికి స్వచ్ఛఅవార్డు లభించింది. జీవిఎంసీ ముఖ్య కమీషనర్ డాక్టర్ సృజన హోల్‌సేల్ కాయగూరల వర్తక సంక్షేమ సంఘం ప్రతినిధులకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందజేసారు. వర్తకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి జగదీష్, వైఎన్ భద్రం కొణతాల శివ, తదితరులు పాల్గొన్నారు.

# సబ్బవరం వ్యవసాయ అధికారిగా పి.సత్యనారాయణ



సబ్బవరం : సబ్బవరం మండలం వ్యవసాయాధికారిగా పోతల. సత్య నారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన పరవాడ మండలంలో వ్యవసాయాధికారిగా 8 సంవత్సరాలు పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన వ్యవ సాయాధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలంలో రైతు సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా సమర్థవంతంగా పనిచేస్తానన్నారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ క్షేత్రస్థాయిలో వారికి అందేలా కృషి చేస్తానన్నారు. ఉన్నత అధికారుల రైతులు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

## గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్యకు ఘననివాళి

చోడవరం : గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 126 వ జయంతిని పట్టణంలోని శాఖా గ్రంధా లయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధి కారిణి ఎం.ఎస్.ఎల్. జోగేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వపు లైబ్రేరియన్ డి.గోపాలరావు, చీడికాడ లైబ్రేరియన్ కె.మాలతి, సౌమ్య తదితరులు పాల్గొని అతని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో రిటైర్డు పోస్టుమాస్టర్ కృష్ణ, గ్రంధాలయ పాఠకులు కోటి, రాము, ఉపాధ్యాయుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



చోడవరంలో అయ్యంకి వెంకటరమణయ్యకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి తదితరులు

## విశాఖను దేశంలోనే

# అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దాలి

### విఎంఆర్డీఏ కమిషనర్‌కు స్వాతి యండీ శుభాకాంక్షలు



సిరిపురం : విఎంఆర్డీఏ కమీషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.కోటేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి 10 సంవత్సరాల వయస్సు కలిగిన బోన్సాయ్ రావి చెట్టును ప్రముఖ రియల్ వ్యాపార సంస్థ స్వాతి ప్రమోటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి బహుకరించడమైనది. ఆయన హయాంలో విశాఖను దేశంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దాలని రమేష్ రెడ్డి అభిలాషించారు.

## ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు

గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల జెడ్పీ హై స్కూల్ 2018-19 విద్యా సంవత్సరంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన బాలికలకు హిందీ నటుడు అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో నడుపుతున్న రన్ ఫర్ నైన్ స్వచ్ఛంద సంస్థ వారు బుధవారం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి వైద్యులు అయ్యప్ప విచ్చేసి బహుమతి ప్రధానం చేశారు.

# ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



గాజువాక: మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్‌జగన్ ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి బుధవారం క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. గాజువాక వైకాపా పార్టీ కార్యాలయంలో వైకాపా మహిళానేత పల్లా చినతల్లి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా వైకాపా మహిళా విభాగం నేతలు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, రాష్ట్ర ప్రజల మన్నలను పొందుతూ, ప్రజారంజక పాలనతో వైకాపా ప్రభుత్వం ముందుకు పోతున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు. గత పాలకులు హామీలిచ్చి మోసం చేసారని, వైకాపా ప్రభుత్వం హామీలివ్వడమే కాకుండా ఆచరణ చేయడం హర్షనీయమని అన్నారు. మహిళలకు నామిటెడ్ పోస్టులలో, గ్రామవాలంటీర్ల పోస్టులలో మహిళకు తగిన ప్రాధాన్యం కల్పించడం శుభపరిణామమని అన్నారు. అలాగే అంగన్వాడీ, ఆశావర్కర్ల జీతాలు పెంపు తదితర అంశాలలో ఇచ్చిన హామీప్రకారం చేయడం వలన మహిళలకు ఆర్థికంగా న్యాయం చేసినట్లుందని అన్నారు. ఈవిషయంలో మహిళలు ముఖ్యమంత్రి జగన్‌కు ఋణపడి ఉంటారని అన్నారు.

# దివ్యాంగ బాలల భవిష్యత్తుకు మార్గ దర్శనంగా భవితా కేంద్రాలు

## జిల్లా సహిత విద్య సహాయ సమన్వయకర్త ఎస్.రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.రామకృష్ణ

చోడవరం : దివ్యాంగ బాలబాలికల భవిష్యత్తుకు మార్గ దర్శనంగా భవిత కేంద్రాలు రూపుదిద్దుకుంటుందని, తల్లి దండ్రులు తప్పనిసరిగా వారి పిల్లలను భవిత కేంద్రాలలో శిక్షణ ఇప్పించాలని జిల్లా సహిత విద్య సహాయ సమన్వయకర్త ఎస్.రామకృష్ణ అన్నారు. పట్టణంలోని స్థానిక భవిత కేంద్రంలో చోడవరం, చీడికాడ, వి.మాడుగుల మండలాలలకు చెందిన దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులు, పిల్లలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జాతీయ మానసిక దివ్యాంగుల సాధికార సంస్థ,ప్రాంతీయ సమ్మిళితశిక్షణా సంస్థ నెల్లూరు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిత కేంద్రంకు హాజరగు చిన్నారులకు నెలకు 300, పాఠశాలకు సహాయకుని సహాయంతో వెళుతున్న దివ్యాంగులకు 250 రూపాయలు దివ్యాంగ బాలికలు 6 నుంచి 8 వ తరగతి చదువుతున్న వారికి 200, గృహ విద్య కార్యక్రమం ద్వారా శిక్షన పొందుతున్న దివ్యాంగులకు 290 రూపాయల చొప్పున నెలకు అందచేయబడుతుందని వివరించారు. అనంతరం స్థానిక ఎం.ఈవో పి.అచ్చుతరావఖ మాట్లాడుతూ వైకల్యం అనేది శరీరానికే గాని మనస్సుకు కాదని, దిగులు చెందకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, దానికి తల్లిదండ్రులు తమ వంతు పూర్తి సహకారం అందించాలని కోరారు. అంతకు ముందు శిక్షణా కార్య క్రమంలో డాక్టర్ ఈశ్వరరావు, ఎస్.రాజేష్, రఘునాద్ తది తరులు దివ్యాంగులకు అందచేస్తున్న పునరావాస కార్య క్రమాలు, ఇంటి వద్ద దివ్యాంగులను సాకే విధానాలు, తర్ఫీదులను పొజెక్టర్ ద్వారా తెలియచేశారు. ఈ కార్య క్రమంలో బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.కృష్ణ కుమారి, వై.లక్ష్మీదేవి, రీసోర్సు ఉపాధ్యాయులు భీశెట్టి అప్పల రాజు, సరస్వతిదేవి,దేముళ్ళు ఆచారి, సత్యారావు పాల్గొన్నారు.

# కశింకోట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

కశింకోట : కశింకోట మండలంలో నూతన గుంటపాలెం వద్ద జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, లారీని ఢీకొన్న ఈసంఘటనలో 13 మందికి గాయాలయ్యాయి. అందులో పలువురు పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. వారిని విశాఖపట్నం కేజిహెచ్ చికిత్సకై తరలిస్తున్నారు. నిద్ర మత్తులో డ్రైవర్లు ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల ప్రమాద సంఘటన జరిగిన వెంటనే గాయపడిన వారిని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీకాకుళం జిల్లా పలాసా నుండి విజయవాడకు 40 మంది ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు ప్రమాదానికి గురి కావడంతో ప్రయాణీకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఆదిత్యలో ఘనంగా కాటన్ వర్థంతి



గండేపల్లి : సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో గల కాటన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ మరియు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎమ్.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జనరల్ సర్ ఆర్థర్ థామస్ కాటన్ (15 మే 1803 - 24 జూలై 1899) బ్రిటిష్ జనరల్ మరియు ఇరిగేషన్ ఇంజనీర్.అయిన కాటన్ బ్రిటిష్ వారు అయినప్పటికీ తెలుగు వారి గుండెల్లో ముఖ్యంగా ఉభయ గోదావరి ప్రజల హృదయాలలో స్థిరమైన స్థానం సంపాదించి పూజలందుకొంటున్నారని, రైతులకు ఆయన ప్రాతః స్మరణీయులు అని అన్నారు. కాటన్ బ్రిటిష్ ఇండియా అంతటా నీటిపారుదల మరియు నావిగేషన్ కాలువల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశాడు. ప్రకాశం బ్యారేజ్, ధవళేశ్వరం బ్యారేజ్ మరియు కర్నూలు కడ్డప్ప కెనాల్ (కె. సి. కెనాల్) నిర్మిం చడం ద్వారా అతను చాలా మందికి సహాయం చేశాడు. అతని కల పాక్షికంగా మాత్రమే సాకారం అయింది, కాని ఆయన చేసిన కృషికి ఆంధ్ర ప్రదేశ్ మరియు తమిళ నాడు ప్రాంతాలలో ప్రజలు ఇప్పటికీ గౌరవించుకొంటారు అని డా. ఎమ్.ఎస్.రెడ్డి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వి.శ్రీనివాసరావు మాట్లా డుతూ సర్ ఆర్థర్ కాటన్ మ్యూజియాన్ని ఆంధ్ర ప్రదేశ్‌లోని రాజమండ్రిలో ఆయన గౌరవార్థం నిర్మించారని . 1847 నుండి 1852 వరకు ఆంధ్ర ప్రదేశ్‌లో బ్యారేజీని నిర్మించేటప్పుడు కాటన్ ఉపయో గించిన సుమారు వంద చిత్రాలు మరియు 15 యంత్ర పరికరాలను ఈ మ్యూజి యంలో బద్రపరిచారని భావితరాలకు ముఖ్యం గా యువ ఇంజినీర్లకు కాటన్ జీవితం మార్గదర్శకంగా నిలుస్తుం దనడంలో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. డి. ఆర్.డి డైరెక్టర్ డా కె.వి.ఎస్.రామచంద్ర మూర్తి, మెకానికల్ విభాగాధిపతి డా. బి.హెచ్. వర పసాద్, కంట్రోల్ ఆఫ్ ఎక్సమినేషన్స్ ప్రో.జొన్నల గడ్డ పవన్,ఎ.వి.బి.ఎస్. శర్మ, వై.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ఇసుక విక్రయ కేంద్రానికి స్థలం కేటాయింపు



గాజువాక: ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇసుక విక్రయకేంద్రానికి ప్రభుత్వానికి సంబంధించిన తగిన స్థలాన్ని కేటాయింపు చేసినట్లు గాజువాక మండల తహశీల్దార్ శివ తెలిపారు. ఇందుకు బధవారం వడ్లపూడి గ్రామంలో సర్వే నెం 31బై1లో సుమారు 3.40 ఎకరాల స్థలాన్ని గుర్తించామని, జీవీయంసీ సహకారంతో జెసీబితో ఆ స్థలాన్ని చదును చేసి సంబందిత ఎపియండిసి, మైన్స్ విభాగం అధికారులకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇంకా తుప్పలు ఉన్నందున గురువారం కూడా జెసీబీతో వాటిన తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ విక్రయ కేంద్రం ద్వారా కావలసినవారికి ప్రభుత్వం కేటాయించిన ధరలకు ఇసుకను ఆన్‌లైన్‌లో అందజేయడం జరుగుతుందని తెలిపారు.

# స్పందనలో..ప్రతిస్పందన..బాధితులకు అండగా పోలీసులు

విజయనగరం : భాధితుల సమస్యలకు సత్వర న్యాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పోలీసుశాఖ నిర్వహిస్తున్న "స్పందన" కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని పోలీసుశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుండడంతో బాధితుల నుండి అనూహ్య స్పందన లభిస్తుంది.జిల్లా ఎస్పీ బి.రాజకుమారి జూలై 22న నిర్వహించిన "స్పందన" కార్యక్రమంకు బొబ్బిలి పట్టణం మల్లంపేటకుచెందిన అనిపిండి స్రవంతి జిల్లా ఎస్పీని కలిసి తన బాధను చెప్పుకొనేందుకు వచ్చారు. తనకు పాము కాటు వలన సరైన చికిత్స జరగక ఇన్‌ఫెక్షన్ గురై కాళ్ళు చచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్నట్లు, గతంలో జిల్లా ఎస్పీ పాలరాజు అందించిన ఆర్థిక సహాయంతో భువనేశ్వర్‌లో శస్త్ర చికిత్స జరిగినట్లు, ఇంకనూ మరోసారి శస్త్ర చికిత్స నిర్వహించాల్సి ఉందని, అందుకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

# టిడిఎల్‌పి డిప్యూటీ లీడర్లను ఏపీ అసెంబ్లీ నుంచి సస్పెన్స్ చేయడం దారుణం



సింధియా: ప్రజా సమ్యస్యలపై న్యాయం చేయండి అడిగినందుకు శాసనసభ టిడిపి డిప్యూటీ లీడర్లు అచ్చెంన్నాయుడు, బుచ్చయ్య చౌదరి, రామానాయుడులను రాష్ట్ర అసెంబ్లీ నుంచి స్పీకర్ సస్పెన్స్ చేయడం దారుణమని, ఇది అప్రజాస్వామ్యం అని జీవీయంసీ 49వ వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జిసోమేష్ ధ్వజమెత్తారు. బుధవారం అందుకు నిరసనగా మల్కాపురం ప్రకాష్‌నగర్ తెదేపా పార్టీకార్యాలయం వద్ద తెదేపా శ్రేణులు బైఠాయింపు నిర్వహించి, నిరసన తెలియజేసారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మజ్జి సోమేష్ తెదేపా నాయకులు కాకి పోలిరెడ్డి, మజ్జిమాలినాయుడులు పాల్గొని మాట్లాడుతూ సమస్యలపై తెదేపా శాసనసభ్యులు మాట్లాడుతుంటే వైకాపా ప్రభుత్వం గొంతునొక్కేస్తుందని, రాష్ట్రంలో వైకాపా ఆరాచకాలు ఎక్కువైపోయాయని మండిపడ్డారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, మరి కొద్దిరోజులలో వైకాపా బండారం బయట పడుతుందని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నట్లు ప్రకటనలే తప్ప నేటికి ఒక్కటీ కూడా కార్యరూపం దాల్చలేదని అన్నారు. సభ్యులు ఎక్కువమంది ఉన్నారని గర్వంతో అసెంబ్లీలో తెదేపా నోరునొక్కేస్తున్నారని విమర్శించారు. రానున్న కాలంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు దొప్ప సన్యాసిరావు, తెదేపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వెలుగు ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా

దేవరాపల్లి, : జిల్లా గ్రామీణ అభివృద్ధి సీడాప్ లో భాగంగా డిడియు జికెవై పథకం ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు వెలుగు ఆధ్వర్యంలో 29తేది సోమవారం నాడు హీరో కంపెనీ నందు పని చేయుటకు దేవరాపల్లి వెలుగు కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని వెలుగు ఎపిఎం బి.డి. తిలక్ , బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాకు యువతీ యువకులు బీఎస్సీ కెమిస్ట్రీ , ఆర్గానిక్ కెమిస్ట్రీ ,ఎనలిటికల్ కెమిస్ట్రీ ,చేయు డిగ్రీ కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు అర్హత కలిగిన వారు విద్యా సర్టిఫికెట్స్ తో ఉదయం పది గంటలకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబరులను 7993312893 ,7386713880 ,సంప్రదించాలని ఆయన తెలిపారు.

## వ్యక్తిగత శుభ్రత మహా ఆరోగ్య బలం

### -ఎన్ఎస్ఎఫ్ ఫౌండేషన్ ఆర్.ఎన్. హిమబిందు

దేవరాపల్లి,: మండలంలోని రైవాడ పంచాయతీ బేతపూడి కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాలలో స్టేట్ సమగ్ర శిక్షణ అభియాన్ కార్యాలయం నుండి ఆర్. ఎన్. హిమబిందు తొమ్మిది, పదవ, తరగతి విద్యార్థులను ఎస్ఓ ఎం. విజయ, ఆధ్వర్యంలో సమావేశ పరిచి వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి విద్యార్థికి బుధవారం అవగాహన కలుగు చేశారు.
ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ, ప్రతి మహిళకు రుతుస్రావం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి అలాగే వ్యక్తిగత పరిశుభ్రత యొక్క విధానాలను గురించి తెలియచేశారు.

ఇలా చేయటం వలన వ్యక్తి యొక్క వ్యక్తిగత శుభ్రతను బట్టే తమ ఆరోగ్య బలం మరింత ప్రతిష్ఠాత్మకంగా ఉండడంతో పాటు ఉల్లాస జీవితం గడుపుతారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థ్యులకు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణి



భీమునిపట్నం: స్థానిక 18 వ వార్డు మున్సిపల్ హై స్కూల్ నందు ఆయుర్వేద వైద్యులు సత్తరవు వాయునందనరావు ఆర్థిక సహాయంతో నియోజకవర్గ బీజేపీ అధ్యక్షులు ఉప్పాడ అప్పారావు విద్యార్థిని, విద్యార్థ్యులకు ఉచితంగా 150 మందికి బస్ పాస్ లు అందజేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ ఎం సిం హాచలం, ఉపాధ్యాయులతో పాటు ఆర్టీ సి సిబ్బంది మురళీ, అప్పలరాజు లు పాల్గొన్నారు.

## ఆగష్టు 11న ఆదర్శ హిందీ ప్రేమీమండలి ఆధ్వర్యంలో వ్యాసరచన,, చిత్ర లేఖనం పోటీలు

భీమునిపట్నం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో వ్యాసరచన, డిబేట్, చిత్ర లేఖనం తదితర అంశాలపైపోటీలు నిర్వహించనున్నట్లు ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షులు,గౌరవ అధ్యక్షులు కె.ఎస్.ఆర్ కృష్ణారావు,గంటానూకరాజు లు తెలిపారు. ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇందులో మొదటి విభాగం 3నుంచి5 తరగతులు, రెండవ విభాగం 6,7తరగతులు, మూడవ విభాగం 8,9 తరగతులు, నాల్గవ విభాగం ఇంటర్, డైట్, పాలిటెక్నిక్, ఐదవ విభాగం డిగ్రీ, పి.జి విద్యార్థులకు జరుగు తాయని తెలిపారు. ఆదర్శ హిందీ ప్రేమిమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్. కృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ హిందీ ప్రేమీమండలి నందు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ పోటీలలో పాల్గొనే వారు ఆగస్టు 10వ తేదీలోగా 8985647419 నంబర్ ను సంప్రదించాలనీ కోరారు.

వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు ఆగష్టు 11న ఆదర్శ హిందీ ప్రేమీమండలి కార్యాలయం నకు రావాలని . ఆరోజు ఉదయం 8 నుంచి 9వరకు చిత్ర లేఖనం, 9.30 నుంచి10.30 వరకు దేశభక్తి గీతాలు, సాయంత్రం వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
వ్యాసరచన పోటీకి సంబంధించి భారతదేశం ఆర్థిక వ్యవస్థ ను ఏవిధంగా పటిష్ట పరచాలనే అంశంపై పెద్ద తరగతులకు ఉంటుందనీ, అదే విధంగా హైస్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ సంబంధించిన అంశంపై ఉంటుందనీ తెలిపారు. కార్యక్రమంలో కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గంటా నూకరాజు తో పాటు గండిబోయిన పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

## జ్యూట్ మిల్స్ కార్మికులకు యాజమాన్యానికి ఒప్పందం



భీమునిపట్నం ఎంతోకాలంగా కొనసాగు తున్న చిట్టివలస జ్యూట్ మిల్స్ సమస్య మంత్రి వర్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు చొరవతో చిట్టివలస జ్యూట్ మిల్స్ కార్మికులకు యాజమాన్యానికి ఒప్పందం కుదిరిందని జాయింట్ కమిషనర్ లేబర్ టి.వెంకటరత్నం తెలిపారు. మంత్రి చొరవతో కుదిరిన చిట్టివలస జూట్ మిల్స్ ఒప్పందం కార్మిక సంఘాలకు యాజమాన్యానికి జరిగిన చర్చలు సఫలం బోనస్ గ్రాట్యుటీ లీవ్ ఎన్ క్యాష్ మెంట్ చెల్లింపు ఈ ఒప్పందం ప్రకారం రూ 13. 77 కోట్లు గ్రాట్యుటీ, రూ 1.13 కోట్లు బోనస్ రూ 31 లక్షలు సెలవు జీతం చెల్లింపు తో పాటుగా రూ 1.29 కోట్లు ఫిక్స డిపాజిట్ల అసలును పూర్తిగా ఇచ్చేందుకు ఇరువర్గాలు అంగీకరించారన్నారు. దీని మూలంగా శాశ్వత కార్మికులు 2656 మంది,, బదిలీ వర్కర్ లు 1103, న్యూ బదిలీ వర్కర్ లు 692 మొత్తం4 4 51 మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అంతేకాకుండా 21 37 అప్రెంటిస్ పనివారలకు రూ 10 వేల చొప్పున ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించారు. 2007 నుండి రిటైర్ అయిన సుమారు 290 మంది కార్మికులకు గ్రాట్యుటీ చెల్లిస్తారని ఆయన తెలిపారు. ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను సామరస్యంగా ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండేలా చేయడంలో మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస రావు ఎంతో సహాయ సహకారాలు అందించారని కార్మిక సంఘాల వారు, యజమాన్యం కూడా ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు.

ఈ సమావేశంలో యజమాన్యం తరపున లలితమోహన్, ఐ ఎన్ టీ యు సి నాయుకులు జి వెంకట రెడ్డి ఏఐటియుసి పడాల రమణ యూత్ జ్యూట్ మిల్ కాంగ్రెస్ సంఘం తరపున ఎం ఆదినారాయణ, సాడి అచ్చారావు, డిప్యూటీ కమిషనర్ లేబర్ జి. లక్ష్మీనారాయణ . జే సి ఎల్ . వెంకటరత్నం , లక్ష్మి నరసయ్య , మేనేజ్మెంట్ తో పాటు నాలుగు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యంతో యువతకు ఉపాధి అవకాశాలు

### ఒఎస్‌డి జె. రామ్మోహనరావు



విజయనగరం: వృత్తి నైపుణ్యాలను మెరుగు పర్చుకోవడంతో యువత ఉపాధి అవకాశాలను మెరుగు పర్చుకోవచ్చునని విజయ నగరం ఒఎస్‌డి జె. రామ్మోహనరావు యువతకు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ బి. రాజకుమారి ఆదేశాలతో గిరిజన ప్రాంతాల్లో నివసించే యువతకు ఉపాధి అవకాశాలను కల్పిం చేందుకు వృత్తి నైపుణ్య శిక్షణ అవగాహన సదస్సును సాలూరు సిఐ సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో సాలూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒఎస్‌డి జె. రామ్మోహనరావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఒఎస్‌డి జె. రామ్మోహనరావు మాట్లాడుతూ వృత్తి నైపుణ్యాన్ని మెరుగు పర్చుకోవడంతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కేవలం చదువుకోడమే కాకుండా సాంకేతికంగా నైపుణ్యతనుమెరుగు పర్చు కొనేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు. ఇతరుల కంటే ముందుగా, ఉపాధి అవకాశాలను పొందవచ్చునని తెలిపారు.

వృత్తి నైపుణ్యంను సాధించగలిగితే తమకు నచ్చిన రంగంలో ఉన్నతంగా స్థిరపడవచ్చునని, ఆర్థికంగా ముందడుగు వేయగలుగుతారన్నారు. ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా గిరిజన ప్రాంతాల్లో ఉండే యువతకు ఎపి స్కిల్ డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో హొటల్ మేనేజ్‌మెంటు, హౌస్ కీపింగులో రెండు నెలలు శిక్షణను విశాఖపట్నంలో ఇవ్వనున్నామన్నారు. ఈ రెండు నెలల శిక్షణ పూర్తయిన తరువాత ఒక నెల ప్రాక్టికల్ శిక్షణను స్టార్ హొటల్స్ ఇవ్వనున్నామన్నారు.

శిక్షణ కాలంలో యువతకు వసతి, భోజన సదుపాయాలను ఉచితంగా కల్పించనున్నామని, వారు ఎటువంటి ఫీజులు చెల్లించవసరం లేదన్నారు. శిక్షణలో రాణించిన యువకు లకు స్టార్ హొటల్స్‌లో ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. హొటల్‌మేనేజ్‌మెంటు రంగంలోనే కాకుండా యువతకు ఆసక్తి ఉంటే టివి, కంప్యూటరు, సెల్ ఫోను రిపేరు రంగంలోను, మహిళలకు ఎంబ్రాయిడరీ, కుట్టుపనులలో కూడా శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తామని ఒఎస్‌డి రామ్మోహనరావు తెలిపారు. సాలూరు సిఐ సింహాద్రినాయుడు మాట్లాడుతూ సాలూరు సర్కిలు పరిధిలోని మక్కువ, సాలూరు రూరల్, పాచిపెంట మండలా లలకు చెందిన యువకులకు వృత్తి నైపుణ్య శిక్షణ గురించి అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వ హించామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గిరిజన ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఏ రంగంలో రాణించాలన్నా ఆయా రంగంలో ముందుగా నైపుణ్యాన్ని సాధించాలన్నారు.

# ఆర్థిక రంగంలో పన్నులదే కీలక పాత్ర

**ప్రశాంత జీవనం పన్ను చెల్లింపుతో సాధ్యం**
**ఆదాయపు పన్ను శాఖ దినోత్సవంలో వక్తలు**
**ఆర్థిక ,మానవత్వ ,ఆధ్యాత్మిక కోణాలపై చాగంటి విశ్లేషణ**

కాకినాడ: దేశ మానవ సంపదతో పాటు, ఇతర వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రశాంతమైన జీవనానికి అవసరమైన ఆర్థిక భద్రతను కలిగించ కలిగినప్పుడే నిజమైన దేశ భద్రత కలుగుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు.ఆదాయపు పన్ను శాఖ కాకినాడ విభాగం ఆధ్వర్యంలో కాకినాడ ఎస్.ఆర్.ఎంటి ఫంక్షన్ హాల్ లో జరిగిన159 వఆదాయపు పన్ను శాఖ వార్షికోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా పలువురు ప్రసంగించారు. ప్రముఖ ప్రవచకులు చాగంటి కోటేశ్వరరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవత్వాన్ని ఆధ్యాత్మిక విషయాలను దేశ అభివృద్ధిలో ఆర్థిక అంశాలు ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావును అధికారులు ఘనంగా సత్కరించారు. విద్యార్థుల అవగాహన కోసం నిర్వహించిన స్వచ్ఛత, కార్యాలయం సందర్శన ,కళాశాల సందర్శన,తదితర కార్యక్రమంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలు తదితర అంశాలపై విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆదాయపు పన్ను సకాలంలో చెల్లించిన వారికి ఎంతో ప్రశాంతత కలుగుతుందని పలువురు వ్యాఖ్యానించారు. తమ వ్యాపారాలను ఆదాయాలను పెంచుకుంటున్న ప్రజలు సకాలంలో ఆదాయపు పన్ను చెల్లించడం ద్వారా దేశ భద్రతకు ఆర్థికంగా సహాయం చేసిన వారవుతారని వెల్లడించారు. అత్యధిక ఆదాయ పన్ను చెల్లించే వ్యక్తులను ఈ సందర్భంగా గుర్తించి వారికి మేమెంటోలను అందజేశారు.ఆదాయపు పన్ను చెల్లించడంలో నిజమైన దేశ భద్రత కల్పించడంలో యువత పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. చదువుకునే సమయంలోనే ఆదాయపు పన్ను విషయంలో తగిన అవగాహన పొంది సకాలంలో తమ ఆదాయాల నుంచి పన్నులు చెల్లించడం ద్వారా దేశ భవితను కాపాడేవారు అవుతారన్నారు.



నిజమైన ఆర్థిక రక్షకులు పన్ను చెల్లింపుదారులేనని ప్రశంసించారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నవారి పట్ల ఎట్టి పరిస్థితుల్లోను కనికరం చూపేది ఉండదని, ప్రభుత్వం వారి ఆస్తులను జప్తు చేయడానికి కూడా వెనకాడబోదని పలువురు అధికారులు పేర్కొన్నారు.159 వ వార్షికోత్సవాన్ని గత మూడు వారాలుగా వివిధ అంశాలతో నిర్వహించేందుకు సహకరించిన విద్యార్థులు, కళాశాలలు, ఇతర ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా 24 గంటల సేవలను అందించేందుకు ఆదాయపన్ను శాఖ తెర తీసిందన్నారు.అందుకోసం నయా భారత్ పేరిట ఆదాయపు పన్ను శాఖ తమ విధులను పునరంకితం చేస్తుందన్నారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా చాగంటి కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఆదాయపు పన్ను శాఖ అదనపు కమిషనర్ వడ్డాది అప్పలరాజు, ఐసీఎఐ కాకినాడ చాప్టర్ చైర్మన్ కె.విజయ్ బాబు,కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వారణాసి భాస్కరరావు, గోదావరి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు డేగల రమేష్, ఆదిత్య పలువురు ఇన్కమ్ టాక్స్ అధికారులు ,టాక్స్ పేయర్లు, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, వ్యాపారస్తులు ,ఛార్టర్డ్ అకౌంటెంట్లు, సీనియర్ అకౌంటెంట్ లు ,టాక్స్ కన్సల్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## మండల వ్యవసాయ అధికారిగా సంధ్య

దేవరాపల్లి, : మండల వ్యవసాయ అధికారిగా బి. సంధ్య బుధవారం బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ పనిచేసిన వ్యవసాయాధికారి డి. అప్పారావు, బదిలీల్లో లో భాగంగా నర్సీపట్నం వెళ్లగా దేవరపల్లి మండల వ్యవసాయ అధికారి సంధ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తానని ఆమె తెలిపారు.

## బాలల హక్కులను కాపాడుదాం

### - ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి

దేవరాపల్లి, : నేషనల్ కమిషన్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్( ఎన్ సి పీ సీ ఆర్ )ను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని ఎంపీడీఓ సిహెచ్. సుబ్బలక్ష్మి ,అన్నారు. ఎక్కడైనా మండలంలోని పద్నాలుగేళ్ల లోపు బాల బాలికలు చదువు మాని ఎక్కడైనా పనిలో పెట్టిన లేకుంటే బలవంతంగా ఎవరైనా పని చేయించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఇలా ఎక్కడైనా జరిగినట్లయితే వారు వచ్చే నెల ఆగస్టు ఒకటవ తేదీన జిల్లా పరిషత్ కార్యాలయంలో దీనిపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

అలాగే బాలల హక్కులు పై అదే రోజు పది గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎక్కడైనా ఎటువంటి బాలల హక్కులు కాలరాసిన ఈ సమావేశంలో ఫిర్యాదు చేయవచ్చని ఆమె తెలిపారు.

## ఆంధ్రాయూనివర్శిటీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎన్నో ఆశలతో ఎంతో మంది విద్యార్థినీలు వివిధ కోర్సులలో ప్రవేశం పొందారు. చాలా మంది విద్యార్థినిలు ఉన్నత చదువుల కోసం దూరప్రాంతాల నుండి ఏ.యూ.లో ప్రవేశం పొందారు. కానీ ప్రస్తుతం యూనివర్శిటీ క్లాసులు ప్రారంభమై 20 రోజులు కావస్తున్న ఇప్పటి వరకూ 200 మంది విద్యార్థినీలకు హాస్టల్ వసతి లేక చదువు కొనసాగించాలా? మానివేయాలా? అనే సంధిగ్ధంలో ఉన్నారు. మరికొంత మంది ప్రైవేటు హాస్టల్‌లో రోజుకు రూ။250/-లు చొప్పున వసూలు చేసి దోపిడీ చేస్తున్నారు. ఎప్పుడు హాస్టల్ వసతి ఏ.యూ. కల్పిస్తుందో తెలియక దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షుగా విద్యార్థినీల పరిస్థితి ఉంది. కావున సత్వరమే అందరికీ ప్రైవేట్ బిల్డింగ్ లేదా యూనివర్శిటీలో ఉన్నటువంటి ఖాళీగా ఉన్న బిల్డింగైనా చూసి హాస్టల్ వసతి కల్పించి, విద్యార్థినీలను ఆదుకోవాలని కోరుచున్నాము. 2) తెలుగు దేశం పార్టీ హయాంలో గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియమించబడిన గత వైస్ ఛాన్సలర్ అనుచరులుగా పేరుపొంది క్వాటరీని తెలుగుదేశం పార్టీ తొత్తులైన డీన్‌లను తక్షణమే తొలగించవలసిందిగా కోరుచున్నాము.

3) రిటైర్డ్ అయిన ప్రొఫెసర్‌లను గెస్ట్ ఫ్యాకల్టీగా నియమించరాదు. తక్షణమే వారందరినీ తొలగించాలి. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్.సి.పి. విద్యార్థి విభాగం, విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు బి.కాంతారావు, ఏ.యూ. అధ్యక్షులు బి.మోహన్, రాష్ట్ర కార్యదర్శులు: యస్.కుమారస్వామి, ఎమ్.కళ్యాణ్, బి.జోగారావు, విద్యార్థి నాయకులు: సిహెచ్.క్రాంతికిరణ్, సాయిక్రిష్ణ, రంజిత్, అనిల్, పవన్, నిషేక్, నాయక్, వెంకటేష్, విజయకృష్ణ, లీలాకృష్ణ, సంజయ్, త్రినాధ్ మరియు అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మణ్ రావు మృతితీరని లోటు

**మల్లాడి రాజేంద్ర ప్రసాద్**

కాకినాడ : తమ సోదరుడు కామాడి లక్షణరావు మృతి తీరని లోటని మల్లాడి రామారావుమెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మల్లాడి రాజేంద్రప్రసాద్ అన్నారు.మత్స్యశాఖలో ఉప సంచాలకుగా పనిచేస్తున్న లక్ష్మణరావు అనారోగ్యంతో మృతి చెందడం తమ కుటుంబానికి తీరని నష్టమని కన్నీటి పర్యాంతమ య్యారు.విధినిర్వహణలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాధిం చుకు అవినీతి రహితసేవలందించిన ఘనత లక్ష్మణరావుకే దక్కుతుం దన్నారు.జగన్నాధపురం, పొన్నమండ వారి వీధిలో నివసిస్తున్న కామాడ. లక్ష్మణరావు మంగళవారం రాత్రి కన్ను మూసారు. శతాబ్దాల చరిత్ర కలిగిన మల్లాడి వంశపు వారసుడిగా తన తల్లిదండ్రులకు తొమ్మిది మందిలో రెండవ సంతానంగా జన్మించి చిన్న వయసులోనే ప్రభుత్వ ఉద్యోగంలో చేరి (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్),ఉన్నత స్థాయి ఉద్యోగిగా 38 సంవత్సరాలు నిజాయితీతో కూడిన సేవల ందించిన ఆయన పని చేసిన శాఖకే వన్నె తెచ్చిన వ్యక్తిగా లంచం అంటే అసహ్యించుకునే వ్యక్తి, సంఘ సంస్కర్తగా జీవించిన మహనుభావుడు లక్ష్మణరావని సహోద్యోగులు ఉద్యోగులు, అధికారులు ఈ సందర్భంగా లక్ష్మణరావు సేవలను గుర్తు చేసుకున్నారు.

## గిరిజన విద్యార్థులకు సేవా సంస్థలు బ్యాగులు వితరణ



దేవరపల్లి,: మండలంలోని పెదనందిపల్లి సత్యసాయి సేవా సమితి ఫౌండేషన్ అలాగే సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక సమరత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా మండలంలోని వాలాబు, తామరబ్బ, చింతలపూడి, గిరిజన పంచాయతీలో సుమారు పది మండల్ పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఈ సేవా సంస్థల ద్వారా బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు,జామెంట్రీ బాక్స్ మొదలగు కిట్లను విద్యార్థులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్. రవీంద్రబాబు ,పెదనందిపల్లి సత్యసాయి సేవా సమితి రావాడ శశిభూషణ్ రావు , సమాచార హక్కు ప్రచార ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి ఆదిరెడ్డి చినకన్నబాబు ,సమాచార హక్కు మండల ప్రచార ఐక్యవేదిక అధ్యక్షుడు కె.వి. రమణ , సమరసత సేవా ఫౌండేషన్ జీ. రాము, ఈ కిట్లను విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కసిరెడ్డి అప్పల నాయుడు, రొంగలి సత్యం మాస్టార్ , నూలు నారాయణ, వరదపురెడ్డి లలితా ప్రసాద్ ,తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## 53 పోలింగ్ బూత్‌ల తుది జాబితా సిద్ధం

దేవరాపల్లి,: మండలంలోని 27 పంచాయతీలకు సంబంధించిన 53 పోలింగ్ బూతుల తుది జాబితా సిద్ధం చేయడం జరిగిందని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో బుధవారం వెల్లడించారు.

ఈ సందర్భంగా ఆమె పంచాయతి కార్యదర్శులతో మాట్లాడుతూ, ఏ పంచాయతీకి సంబంధించిన పోలింగ్ బూతుల జాబితాను ఆ పంచాయితీ జాబితాలను పంచాయితీ నోటీస్ బోర్డులో పెట్టాలని పంచాయితీ కార్యదర్శులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎం. రాధిక ,ఎంపీడీఓ పరిపాలనాధికారి జి.వి. రమణ, జూనియర్ అసిస్టెంట్ కె. వినోద్ ,పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# విద్యార్థులే వర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లు

- తరగతుల నిర్వహణకు అధిక ప్రాధాన్యం
- సమస్యల రహితంగా వర్సిటీ నిలవాలి
- వ్యక్తిత్వంతో కూడిన వ్యక్తులుగా తీర్చిదిద్దాలి
- విద్యార్థులను చిరునవ్వుతో ఆహ్వానించండి
- ప్రిన్సిపాల్స్‌తో సమావేశంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయంః ఏయూలో విద్యార్థులకు బోధన తరగతులు సక్రమంగా, సమర్థవంతంగా జరపడానికి అధిక ప్రాధాన్య ఇవ్వాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఆయన తన కార్యాలయంలో వర్సిటీ క్యాంపస్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమయ్యారు. సమస్యల రహితంగా వర్సిటీని నిలపాలన్నారు. విద్యార్థులను మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థులను చిరునవ్వుతో ఆహ్వానం పలకాలని సూచించారు. నిబంధనల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెట్టడం కన్నా వారిని వెన్నుతట్టి లక్ష్యం దిశగా ప్రోత్సహించడం అవసరమని సూచించారు. విద్యార్థులే భవిష్యత్తులో వర్సిటీకి బ్రాండ్ అంబాసిడర్లుగా నిలుస్తారన్నారు. ర్యాంకుల కన్నా విద్యార్థుల మోముల్లో చిరునవ్వే ముఖ్యమన్నారు.

వర్సిటీ హాస్టల్స్‌పై ప్రిన్సిపాల్స్ ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు అందించే బోజనం నాణ్యతను నిరంతరం సమీక్షించాలన్నారు. నీటి సరఫరా, విద్యుత్ సరఫరా వ్యవస్థలను గమనించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు ఎదురవకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల విధానంలో, విభాగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడతామన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన రూసా నిధులను సకాలంలో, పూర్తిస్థాయిలో పొందే దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కార్యాచరన రూపొందించి, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామన్నారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య టి.వినోద రావు, ఆచార్య ఎం.ప్రమీల దేవి, ఆచార్య ఎస్.సుమిత్ర, ఆచార్య కె.వి రమణ మూర్తి ,ఆచార్య వి.రమేష్‌లు పాల్గొన్నారు.

### వీసీ ఆచార్య ప్రసాదరెడ్డికి అభినందనల వెల్లువ శుభాకాంక్షలు తెలిపిన ఆచార్యులు



ఏయూ వీసీగా నియమితులైన ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డిని పలువురు ఆచార్యులు అభినందించారు. బుధవారం ఉదయం విజ్ఞాన్ విద్యాలయం సంస్థల రెక్టార్ డాక్టర్ వి.మధు సూధన రావు, డీన్ డాక్టర్ కె.వెంకట రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అరుంధతి, డాక్టర్ కె.ఎం రావులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. వర్సిటీ మహిళా ఆచార్యుల బృందం, లినోరా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ ఆచార్య రాజ శరత్ కుమార్, ఏయూ పాఠశాల అధ్యాపకుల బృందం, వర్సిటీ కామర్స్‌మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు, వర్సిటీ ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# వర్సిటీలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పదవుల్లో ప్రాధాన్యం

### వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఆచార్య వి.క్రిష్ణ మోహన్
### అకడమిక్ డీన్‌గా ఆచార్య కె.వెంకట రావు
### శుభాకాంక్షలు తెలిపిన వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి



ఆంధ్రవిశ్వవిద్యాలయంః ఏయూ రిజిస్ట్రార్‌గా కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ఆచార్యులు వి.క్రిష్ణ మోహన్ నియమితులయ్యారు. అకడమిక్ డీన్‌గా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు కె.వెంకట రావు నియమితులయ్యారు. వీరికి బుధవారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఉత్తర్వులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.బైరాగి రెడ్డి పాల్గొన్నారు. వీరిరువురు వెంటనే పదవీ బాధ్యతలను స్వీకరించారు. వర్సిటీ రిజిస్ట్రార్‌గా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆచార్య క్రిష్ణమోహన్‌ను నియమించారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో సీనియర్ ఆచార్యుడిగా ఉన్న ఆచార్య క్రిష్ణ మోహన్ గతంలో శ్రీకాకుళం అంబేద్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించారు. కార్యదక్షత, సమర్థత కలిగిన వ్యక్తిని రిజిస్ట్రార్‌గా నియమించడం జరిగిందని వీసీ తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి సూచించిన విధంగా వర్సిటీలో సామాజిక విప్లవానికి నాంది పలుకుతున్నామన్నారు. వర్సిటీ పదవుల్లో సైతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. వర్సిటీకి ఆర్థికపరమైన సమస్యలు ఉన్నాయని వీటిని అధిగమించే దిశగా సమర్థవంతంగా పనిచేసే, అనుభవజ్ఞుడైన ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి, స్థానికుడైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని రిజిస్ట్రార్‌గా నియమించడం జరిగిందన్నారు. ఇదే విధానంలో కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన, అనుభవజ్ఞుడైన ఆచార్య కె.వెంకట రావుకు అకడమిక్ డీన్‌గా బాధ్యతలు అందించామన్నారు.

వర్సిటీ అడకమిక్ డీన్‌గా ఆచార్య కె.వెంకట రావును నియమించారు. ఈయన ప్రస్తుతం కంప్యూటర్ సెంటర్ సంచాలకునిగా పనిచేస్తున్నారు. వర్సిటీ పరిశోధకులకు ఉపయుక్తంగా సాంకేతికతను వినియోగిస్తూ డాక్టరేట్‌లు వేగవంతం చేసే దిశగా పనిచేయాలని సూచించారు. పరిశోధకులకు మేలు చేసే దిశగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య టి.వినోద రావు, ఎం.ప్రమీల దేవి, ఎస్.సుమిత్ర, కె.వి రమణ మూర్తి ,ఆచార్య వి.రమేష్‌లు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో బలోపేతం చేద్దాం

- నిర్దేశిత సమయంలో పనులు పూర్తి కావాలి
- విఎంఆర్డిఏ కమిషనర్‌గా పి.కోటేశ్వర రావు బాధ్యతల స్వీకరణ



సిరిపురం: విఎంఆర్డిఏ కమిషనర్‌గా పి.కోటేశ్వర రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్పర్సన్ ద్రోణంరాజు శ్రీనివాస రావును మర్యాదపూర్వకంగా విఎంఆర్డిఏ కార్యాలయంలో కలిశారు. చైర్పర్సన్ అభినందనలు తెలుపుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆశయం మేరకు విశాఖ అభివృద్ధికి కలిసి పనిచేద్దామని తెలిపారు. విఎంఆర్డిఏ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్ పి.కోటేశ్వర రావుకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విభాగాధిపతులు, సిబ్బందితో కమిషనర్ సమావేశమై విఎంఆర్డిఏ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, అధికారులంతా వారికి కేటాయించిన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేసి విఎంఆర్డిఏను బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. మనం చేసే పనిని బట్టే గౌరవం ఉంటుందని, పనితనాన్ని నమ్ముతానని, నా నమ్మకాన్ని నిలబెడతారనే ఆశిస్తున్నానని అన్నారు.

### పాత ఫైళ్లన్ని కంప్యూటరీకరించాలి

విధులలో చేరిన వెంటనే కమిషనర్ 3, 7, 8 అంతస్తుల్లోనున్న విభాగాలన్నిటిని పరిశీలించి అక్కడి అధికారులతో చర్చించారు. 9వ అంతస్తులో నిర్మాణంలోనున్న కమిషనర్ కార్యాలయపు భవనాన్ని తనిఖీ చేశారు. అన్ని విభాగాల్లోనున్న పాత ఫైళ్ళు కంప్యూటరీకరించి డాటాను భద్రంగా నిక్షిప్తం చేయాలని అధికారులకు సూచించారు. మానవ వనరుల అభివృద్ధి అత్యంత ప్రాధాన్యమని, సాంకేతిక అంశాలపై నిపుణలతో శిక్షణ నివ్వడం ద్వారా ఇక్కడి సిబ్బందిని సుశిక్షుతులుగా చేయాలని సూచించారు. ఎవరెవరికి ఎలాంటి శిక్షణ అవసరమో వివరాలను తయారు చేయాలని అన్నారు. అనంతరం ఐ.టి. విభాగాన్ని సందర్శించి, వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని, సైట్ చూసేవారికి విఎంఆర్డిఏ సమాచారం మొత్తం తెలిసేలా ఉండాలని అన్నారు. టపాల్ సెక్షన్‌ను తనిఖీ చేసి కార్యాలయానికి వచ్చిన తపాల్స్‌ను ఈ-ఆఫీసు ద్వారానే సంబంధిత సెక్షన్లకు పంపాలని ఆదేశించారు. ప్రతి ఫైలు ఈ-ఆఫీసు ద్వారానే నిర్వహించాలని తెలిపారు. తొలుత అధికారులను, విభాగాలను సెక్రెటరీ ఏ. శ్రీనివాస్ పరిచయం చేశారు.

# కిడ్నాప్ బాలుడ్ని సురక్షితంగా పట్టుకుంటాం

### జషిత్ కిడ్నాప్ కేసు 17 బృందాలతో గాలింపు
### ఎస్పీ నయీమ్ అస్మి వెల్లడి



మండపేట: తూర్పుగోదావరి జిల్లా మండపేటలోని విజయలక్ష్మీనగర్‌లో జషిత్ అనే బాలుడి అపహరణ కేసులో కొన్ని ఆధారాలు లభ్యమైనట్లు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నయీమ్ అస్మి చెప్పారు. ఈ నెల 22న బాలుడి ఇంటి సమీపంలోని సత్యదేవ అపార్ట్‌మెంట్‌కు అద్దెకోసం వచ్చిన ఇద్దరు యువకులను అనుమానితులుగా భావించి విచారణ చేస్తున్నామన్నారు. మండపేట పోలీస్ స్టేషన్‌లో మీడియాతో ఎస్పీ మాట్లాడారు. అనుమానిత యువకులు వచ్చినప్పటి సీసీ టీవీ దృశ్యాలను ల్యాబ్‌కు పంపించామన్నారు. గతంలో బాలుడి తండ్రి బైక్ చోరీ కేసును పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆర్థిక లావాదేవీలు, మానవ అక్రమ రవాణా, వ్యక్తిగత కక్షలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ వివరించారు. ఈ కేసులో 10 మంది అనుమానితులను విచారించామని, మొత్తం 17 పోలీసు బృందాలు గాలిస్తున్నాయని ఆయన చెప్పారు. కిడ్నాపర్ల నుంచి ఎలాంటి డిమాండ్ రాలేదన్నారు. బాలుడ్ని సురక్షితంగా పట్టుకుంటామని ఎస్పీ నయీమ్ ధీమా వ్యక్తం చేశారు.

### నిబంధనలు ఉల్లంఘించిన
# 33 స్కూలు బస్సులపై కేసు నమోదు

### ఉప రవాణా కమిషనర్ జి.సి.రాజా రత్నం



విశాఖపట్నం : జిల్లా వ్యాప్తంగా స్కూలు బస్సులపై బుధవారం తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న 33 స్కూలు బస్సులపై కేసులు నమోదు చేయడం జరిగింది. గత మూడు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో మొత్తము 45 బస్సులపై కేసులు నమోదు చేయడం జరిగినది.

పర్మిట్లు, వాహన సామర్థ్యం ధృవీకరణ పత్రములు, త్రైమాసిక పన్నులు మరియు ఇతర నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, స్కూలు బస్సులపై కఠినంగా వ్యవహరిస్తామని అలాగే ఏ చిన్న నిబంధన పాటించకపోయినా సరే ఒకే స్కూలు బస్సుకు కేసులు రాయబడిన వారి బస్సు పర్మిటును రద్దు చేయబడునని అలాగే బస్సులు సీజు చేయబడునని ఉప రవాణా కమిషనర్ జి.సి.రాజా రత్నం తెలియజేశారు.

స్కూలు యాజమాన్యం వారు తప్పనిసరిగా వాహనము నడిపేటపుడు పర్మిట్లు, వాహన సామర్థ్యం ధృవీకరణ పత్రములు, స్కూలు బస్సులో సహాయకుడు, బస్సు డ్రైవర్ మరియు సహాయకుడు ఫోను నెంబరులు వారి వెనుక భాగంలో అతికించి ఉండాలి మొదలగు అంశాలను తప్పనిసరిగా పాటించాలని, ఏ కొద్ది నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనబడునని తెలియజేశారు.

నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనబడునని తెలియజేశారు. ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగించబడతాయని ఈ సందర్భంగా తెలియజేశారు. కనుక స్కూలు యాజమాన్యం అందరూ కూడా ఈ విషయాన్ని గమనించాలని ఉప రవాణా కమిషనర్ జి.సి.రాజా రత్నం తెలియజేశారు.




# వర్షాలు సమృద్ధిగా కురవాలంటూ వరదపాయాసం సమర్పణ



సింహాచలంః సింహగిరిపై వరుణయాగంలో భాగంగా వరద పాయసం కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నందున ప్రధాన దేవాలయాల్లో వరుణ యాగాన్ని నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయశాఖ సూచించడంతో మూడు రోజులుగా సింహగిరి క్షేత్ర పాలకులు త్రిపురాంతక స్వామి ఆలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా బుధవారం ఉత్తర భాగంలో వైకుంఠ వాసుని గుట్టపై వరద పాయసం కార్యక్రమం వైధికవర్గాలు శాస్త్రోక్తంగా జరిపారు .

ముందుగా ఆదిశేషుడిపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన వైకుంఠనాథుడు అయిదు శతాబ్దాల తర్వాత సింహగిరి శిఖరంపై దివ్య తేజోమయుడై కొలువుదీరిన వేళ ప్రకృతి పరవశించి పోయింది. వైకుంఠవాసుని మెట్ట వద్ద బుధవారం ఉదయం నిర్ణయించిన శుభముహూర్తం 8.31 గంటలకు వైకుంఠవాసుల మెట్టవద్ద కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభం అయ్యి సుమారు రెండున్నర గంటలపాటు జరిగింది. తొలుత స్వామికి విశ్వక్సేన, పుణ్యహ వచనం పూజలు నిర్వహించారు. అనంతరం విరాటపర్వ పారాయణం, నారాయణ పాశురాలు, గరుడాళ్వార్ విగ్రహస్థాపన, మంగళహారతి. స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పాలు, పెరుగు, పంచామృతాలు అభిషేకం చేశారు. పట్టు వస్త్రాలు పూదండలు, తులసి దళాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం స్వామికి అభిషేకం, ఆరాధన, నివేదన సమర్పించారు. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాలాచార్యులు, ప్రధాన అర్చకులు గొడవర్తి గోపాలకృష్ణమాచార్యులు, అలంకారి కర్రి సీతారామాచార్యులు, వేదపండితులు, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు బాగా కురిసి గ్రామాలన్నీ సుభిక్షింగా ఉండాలని ఆకాంక్షిస్తూ, రాళ్లపై వరదపాయసం పారించారు. ప్రత్యేక పూజల తర్వాత అర్చకులు అక్కడే పాయసం తయారు చేశారు. పండితులు వేద మంత్రోచ్ఛారణ చేస్తుండగా వరద పాయసం పోశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పాయసం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈవోలు కృష్ణమాచార్యులు, పులి రామారావు, ఈఈ మల్లీశ్వరరావు, డిఈ రాంబాబు, ఏఇలు మురళీకృష్ణ, సుంకర సన్యాసిరావు, అప్పారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com